ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం, 21 మే 2024





జల సంక్షోభం!

భానుడు భగ్గుమంటున్నాడు.. పొయ్యి మీద పెట్టిన పెనంలా జిల్లా మండిపోతోంది. ఉక్కపోతతో జిల్లాప్రజానీకం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ పరిస్థితుల్లో జిల్లాలో జల సంక్షోభం ఏర్పడింది. ప్రధాన నీటి వనరులయిన సోమశిల, కండలేరు, రాళ్లపాడు కలిగిరి రిజర్వాయర్లలోని నీటిమట్టాలు కనిష్ఠానికి పడిపోయాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు తడారి నెర్రెలిచ్చిన నేలకు చాలడం లేదు. ఈక్రమంలో గతానికి భిన్నంగా జిల్లాలో రెండో పంటకు విరామం ప్రకటించి, బోర్ల కింద ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని ఇరిగేషన్ యంత్రాంగం ప్రకటించింది. గతేడాది ఆశించిన రీతిలో వర్షాలు కురవకపోవడం, శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు రాకపోవడం, అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టకపోవడమే నీటి ఇబ్బందులకు కారణాలు అయ్యాయి.

జిల్లాలోని ప్రధాన జలవనరుల్లో నీటినిల్వ (టీఎంసీలలో)

జలవనరు	సామర్థ్యం	ప్రస్తుత నిల్వ
సోమశిల	77.988	7.691
కండలేరు	68	6
రాళ్లపాడు	1.05	0.4
కనిగిరి	3.45	0.4
గండిపాళెం	1.88	0.205

- కనిష్ఠ మట్టానికి సోమశిల, కండలేరు డ్యాంలు
- రెండో పంట కింద ఆరుతడి పైర్ల సాగు
- వాటికీ తప్పని నీటి ఇబ్బందులు
- ముందస్తు ప్రణాళిక లేకనే ఈ దుస్థితి


అనంతసాగరం, మే 20 : సోమశిల జలాశయం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు. గతేడాది ఈ సమయానికి 30 టీఎంసీల నీరు నిల్వ ఉండేది. ప్రస్తుతం 7.691 టీఎంసీలకు పడిపోయింది. సహజంగా సోమశిల డ్యామ్ పరిధిలో నీటి లభ్యతను బట్టి మొదటి పంటకు నవంబరులో, రెండో పంట కింద ఏప్రిల్ 15 నుంచి నీరు ఇవ్వాలి. అయితే, ఈఏడాది మొదటి పంట అవసరాలకు నీటి కేటాయింపులు చేసి వరిసాగుకు చర్యలు చేపట్టారు. ఇక రెండో పంటకు వచ్చేసరికి నీరు లేక సాగుకు విరామం ప్రకటించారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. సోమశిల జలాశయంలో నీటినిల్వ కనిష్ఠానికి పడిపోయింది. కేవలం తాగునీటి అవసరాలకు వినియోగించుకొనే పరిస్థితి ఉండగా, జూన్‌లో కూడా ఎండ తీవ్రత అధికంగా ఉంటే నీటి ఇబ్బందులు జటిలమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ఎండలు మండిపోతుండటం, చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోవడంతో ఆత్మకూరు, ఉదయగిరి, మర్రిపాడు, వింజమూరు, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటి సాగులో ఉన్న బత్తాయి, నిమ్మ, బొప్పాయి పంటలు ప్రశ్నార్థకంగా మిగిలాయి. పశువులకు నీరు దొరక్క పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల గ్రాసం కూడా దొరక్క మూగజీవాలను అమ్ముకునే పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. కాగా, కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఆరు టీఎంసీల నీరు నిల్వ ఉంది. వర్షాలు కురవకపోతే మంచినీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. రాళ్లపాడు రిజర్వాయర్ పూర్తిస్థామర్థ్యం 1.05 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.4 టీఎంసీల నీరు మాత్రమే ఉంది.

● ఆరుతడి పంటల సాగుకు సూచన

నీటి ఇబ్బందుల కారణంగా రైతులు ఆరుతడి పంటలు సాగుచేసుకోవాలని జిల్లా యంత్రాంగం సూచించింది. ఈ సీజన్‌లో ఆరుతడి పంటలైన జొన్న, సజ్జ, మొక్క జొన్న, మినుము, అలసంద, వేరుశనగ, నువ్వులు, పెసర, నువ్వు తదితర పంటలు సాగు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈపంటలకు నీటి ఖర్చు 5 నుంచి 6 రెట్లు తక్కువగా ఉంటుందని, సాగు ఖర్చులు కూడా తక్కువని, ఆదాయం మాత్రం వరిపైరుకి సమానంగా కానీ, అంతకంటే ఎక్కువగా వచ్చే వీలుందని అధికారులు తెలియచేశారు. అయితే సాగుపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. ఇప్పటికైనా నీట ఇబ్బందులపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన కలిగించాల్సి ఉంది.



ఉదయగిరి రూరల్ : గండిపాళెం రిజర్వాయర్‌లో క్లస్టర్ గేటుకు దిగువన ఉన్న నీరు



అనంతసాగరం : కనిష్ఠ మట్టానికి చేరుకున్న సోమశిల జలాశయం

డెల్టాలో ప్రత్యామ్నాయం లేదా!?

- రబీ అనంతరం బీళ్లుగా పొలాలు
- ఎంఎస్‌పీ నిర్ధారణపై మీనమేషాలు
- రైతుల అభివృద్ధిని విస్మరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

అల్లూరు : డెల్టాలో వరికి ప్రత్యామ్నాయ పంటలు లేనట్టేనా...? ఈ ప్రశ్న ప్రతి రైతులోనూ మెదలుతోంది. గతంలో వరిసాగు చేసి ఘోరంగా దెబ్బతిన్న రైతులు ప్రస్తుతం రెండు పంటల తరువాత కోలుకుంటున్నారు. అయితే ప్రత్యామ్నాయ పంటలు వేసే అవకాశం లేక... ఒకప్పుడు సోమశిల ఆయకట్టు పరిధిలో రెండోకారు పంటకు సాగునీటి కోసం రైతులు ధర్నాలు చేపట్టారు. ఈ ఏడాది జలాశయాలు అడుగంటడంతో రెండోకారు పంట వేయలేదు. డెల్టా ప్రాంతమైన సుమారు 2.34 లక్షల ఎకరాల్లో కేవలం వరి పైరునే రైతులు సాగుచేస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించడం లేదు.

● అధికారుల విఫలయత్నం

ఇతర పంటలపై రైతులు ఆసక్తి కనపరచేందుకు అధికారులు విఫలయత్నాలు చేశారు. శాస్త్రవేత్తలను తీసుకొచ్చి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. కానీ ఆ చర్చలు ఫలితాన్నివ్వలేదు. కష్టపడిన రైతుకు గిట్టుబాటు ధర లభిస్తే ఎవరి సిఫారసు లేకుండా పంటలు పండించేందుకు స్వతహాగా సిద్ధపడతాడు. రెండో పంట లేని కాలంలో ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితోనో లేక నీటితో అవసరం లేకుండానో రెండు నెలల కాలం పంటలను వేసుకొని రైతులు పంటలు పండించుకుంటారు. అయితే ప్రస్తుతం ఈ పరిస్థితి లేదని రైతులు అంటున్నారు.

● వాణిజ్య పంటలకు అవకాశం

డెల్టాలో సారవంతమైన భూములు ఉన్నాయి. వివిధ వాణిజ్య పంటలు వేసేందుకు అవకాశం ఉన్నా రైతులు ఆదిశగా ముందుకు రావడం లేదు. గతంలో జలాశయాల్లో సాగునీరు పుష్కలంగా ఉంది. కానీ సాగు వ్యయం అధికమవడంతో రైతులు భరించలేని పరిస్థితుల్లో ఉండిపోయారు. కానీ వాణిజ్య పంటలు పండించిన రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో జలాశయాల్లో సాగునీరు లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలు వేసుకుంటే కొంతమేర రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోగలరు.

● ఎంఎస్‌పి నిర్ధారణపై మీనమేషాలు

రైతులు పండించిన ధాన్యానికి ఒక నిర్దిష్ట ధరను ప్రభుత్వం నిర్ణయించి రైతులను నష్టపోకుండా చేసే ప్రక్రియను ఎంఎస్‌పీ (మినిమమ్ సెల్లింగ్ ప్రైస్) అంటారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీన్ని చేపట్టడం లేదు. ఈ విధానాన్ని పకడ్బందీగా చేపడితే రైతులు రారాజులవ్వడం ఖాయం.

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన లేదు

డెల్టా ప్రాంతం రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన లేదు. మా ప్రాంతంలో ఎలాంటి పంటలు వేసుకోవాలో తెలియక ఆ వైపు ఆలోచించలేకున్నాం. అవగాహనా లోపంతో పంటలు వేస్తే నష్టాలు చేకూరితే తట్టుకోవడం కష్టం. అందుకే ఆ దిశగా ధైర్యం చేయలేకున్నాం. అధికారులు అవగాహన కల్పిస్తే బావుంటుంది.



- జరుగుమల్లి చిరంజీవి, రైతు, అల్లూరు

వరిసాగే ఆధారం

డెల్టా రైతులమైన మేము కేవలం వరిసాగుపైనే ఆధారపడుతున్నాం. ఏడాదిలో ఒక్క పంటకే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులకు వెన్నుదన్నుగా నిలవాల్సిన ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచించడం లేదు. ప్రత్యామ్నాయ పంటలు వేయమని అధికారులు అంటున్నారేతప్ప పండించిన ధాన్యానికి గిట్టుబాటును కల్పించలేకపోతున్నారు. వారు ఈ విధంగా ఉంటే ప్రత్యామ్నాయ పంటలు ఎలా వేయగలం.



- తోట శ్రీహరి, గ్రద్దగుంట, అల్లూరు మండలం

మంచినీటి ఇబ్బందులు రానీయొద్దు!

- పరీక్షలు నిర్వహించి నాణ్యమైన నీటిని అందించాలి
- సమీక్షలో కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (జడ్పీ), మే 20 : వేసవి తీవ్రత దృష్ట్యా జిల్లాలో మంచినీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కార్యాచరణతో పని చేయాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో వేసవిలో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అప్రమత్తంగా ఉంటూ అన్ని చర్యలు చేపట్టాలన్నారు. నెల్లూరు, కందుకూరు, కావలి, ఆత్మకూరు మున్సిపాలిటీలలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు నీటి నిల్వలను పరిశీలిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని సూచించారు. నీటి నాణ్యతను కూడా పరీక్షించి, పరిశుభ్రమైన నీటిని సరఫరా చేయాలని, తాగునీటి సమస్యలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అవసరమైన చోట ట్యాంకర్లతో నీటి సరఫరా చేయాలని, గ్రామాల్లో పని చేయని బోర్లను గుర్తించి మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. సోమశిల, కండలేరు జలాశయాల్లో తాగునీటి అవసరాలకు సరిపడా నీటి నిల్వలు ఉంచుకోవాలన్నారు. అందుకనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమీక్షలో నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, జిల్లా పంచాయతీ అధికారి సుస్మిత, డ్వామా పీడీ వెంకట్రావు, ఇరిగేషన్, తెలుగుగంగ ప్రాజెక్టు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలు కృష్ణమోహన్, రమణారెడ్డి, ఎస్కే మర్దన్ అలీ, పబ్లిక్ హెల్త్ ఈఈ సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

దేవతలారా రారండి!

- పెంచలకోనలో వైభవంగా ధ్వజారోహణం
- శేషవాహనంపై నృసింహుడి వైభోగం



దేవేరులతో కలిసి శేషవాహనంపై విహరిస్తున్న పెంచల స్వామి

రాపూరు (డక్కిలి), మే 20 : పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గరుత్మంతుడి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో తిరుచ్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. తెల్లటి గుడ్డపై పసుపు, గంధం, కుంకుమతో ప్రత్యేకంగా తయారు చేసిన గరుత్మంతుడి ప్రతిమను ధ్వజస్తంభంపై ఎగుర వేసి సకల దేవతులకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కోడిముద్ద ప్రసాదం కోసం మహిళా భక్తులు పోటీపడ్డారు. తిరుచ్చి ఉత్సవం, సహస్ర దీపాలంకారసేవ, ఊంజల్ సేవ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అలంకార మండపంలో ప్రత్యేక స్నపన తిరుమంజనాలు చేశారు. అనంతరం ఉభయ దేవేరులతో కలిసి శేషవాహనంపై కొలువుదీరిన స్వామివారు కోనవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటలకు స్వామిఅమ్మవార్లకు పూలంగిసేవ, 8 గంటలకు హంసవాహన సేవ, 11.30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్రదీపాలంకరణ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత సేవ జరగనుంది.



ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు



హనుమపై శ్రీహరి విహారం

నెల్లూరు రూరల్, మే 20 : వేదగిరిపై జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి లక్ష్మీనరసింహుడు హనుమంతుడిపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివార్లను అలంకరణ మండపానికి తీసుకొచ్చిన అర్చక బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమంత వాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ఊరేగించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు చప్పర ఉత్సవాన్ని నిర్వహించిన అర్చకులు, ఆపై గిరిప్రదక్షిణ చేపట్టారు. ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకుడు భాస్కరచార్యులు, ఉభయకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో రేపు సంబరం

- 8, 9 స్నాతకోత్సవాలు ఒకేసారి నిర్వహణ
- పాల్గొననున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

వెంకటాచలం, మే 20 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) 8, 9వ స్నాతకోత్సవాలు ఈ నెల 22వ తేదీన నెల్లూరు శివార్లలోని ఆ వర్సిటీలో జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వీఎస్‌యూ ఉపకులపతి జీఎం సుందరవల్లి తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో రిజిస్ట్రార్ పీ రామచంద్రారెడ్డితో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. గతేడాది వర్సిటీలో సిబ్బంది అంతా కలిసి వర్సిటీకి న్యాక్ గ్రేడ్ సాధించడంలో నిమగ్నమైనందున స్నాతకోత్సవం నిర్వహించలేదన్నారు. న్యాక్‌లో ఏ గ్రేడ్ రావడం శుభపరిణామమని, ఇప్పుడు ప్రతిష్ఠాత్మకంగా రెండు స్నాతకోత్సవాలను బుధవారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన జరిగే ఈ వేడుకలకు ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జీ సతీష్‌రెడ్డి కూడా హాజరుకానున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్‌లో వైద్యసేవలు అందించే ప్రముఖ ఈఎన్‌టీ వైద్యుడు ఈసీ వినయ్ కుమార్‌కి గౌరవ డాక్టరేట్ అందిస్తున్నామన్నారు. స్నాతకోత్సవ వేదిక వద్ద ప్రత్యక్షంగా 275 మంది డిగ్రీలు (పీహెచ్‌డీలు 19, పీజీ డిగ్రీలు 236, బంగారు పతకాలు 20) అందుకోనున్నారని తెలిపారు. పరోక్షంగా పోస్టు ద్వారా 3361 మంది డిగ్రీలు (పీహెచ్‌డీలు 2, యూజీ డిగ్రీ 3162, పీజీ డిగ్రీ 196) అందుకోనున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు, కావలి వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సీహెచ్ విజయ, టీ వీరారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారిని ఆర్ మధుమతి తదితరులున్నారు.

కాగా, స్నాతకోత్సవానికి గవర్నర్ రానుండటంతో ఏర్పాట్లపై కలెక్టర్ హరినారాయణ న్, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



గవర్నర్ పర్యటనపై కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడుతున్న వీసీ

నేటి రాత్రి గవర్నర్ రాక!

నెల్లూరు (వ్యవసాయం) : రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ జిల్లా పర్యటనలో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. మంగళవారం సాయంత్రం 5.10 గంటలకు గుంటూరు నుంచి రైలులో బయలుదేరి రాత్రి 9.24 గంటలకు నెల్లూరుకు చేరుకుని ఓ హోటల్‌లో బస చేస్తారు. బుధవారం ఉదయం 11.30 నుంచి 12.55 గంటల వరకు వీఎస్‌యూ స్నాతకోత్సవ వేడుకల్లో గవర్నర్ పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు నెల్లూరు నుంచి రైలులో విజయవాడకు బయలుదేరి వెళతారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి : ఎస్పీ

నెల్లూరు(క్రైం), మే 20: పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం నాయకులు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా సిబ్బంది ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎస్పీ ప్రతి శుక్రవారం పోలీస్ వెల్ఫేర్‌డే నిర్వహించి సిబ్బంది సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, అసోసియేట్ అధ్యక్షుడు వై శ్రీహరి, ఉపాధ్యక్షుడు పి.శేషయ్య, కోఆపరేటివ్ కార్యదర్శి ఎస్‌కే గౌస్‌బాషా, సభ్యులు బీవీ నరసయ్య పాల్గొన్నారు.



ఎస్పీని కలసిన పోలీసు అధికారుల సంఘం నాయకులు

కొనసాగుతున్న కార్టన్ సర్చ్

నెల్లూరు(క్రైం), మే 20: జిల్లాలో పలు చోట్ల పోలీసులు సోమవారం కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం వేదాయపాలెం, కావలి రెండవ పట్టణం, ఉదయగిరి, వెంకటాచలంసత్రం, ఆత్మకూరు, సైదాపురం, బుచ్చి, టీపీ గూడూరు, ముత్తుకూరు పోలీసు స్టేషన్‌ల పరిధిలో కార్డన్ సర్చ్‌లు నిర్వహించారు. సెరైన పత్రాలు లేని 40 బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సామాన్య ప్రజల్లో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి ఈ కార్డన్ సర్చ్ ఆపరేషన్ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు.



కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

లారీని ఢీకొన్న మోటారు బైక్.. ఒకరికి గాయాలు

సంగం, మే 20: మండలంలోని పెరమన క్రాస్‌రోడ్డుకు సమీపంలోని ముంబాయి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని సోమవారం వెనుక నుంచి వస్తున్న మోటారు బైక్ అదుపు తప్పి ఢీకొంది. పోలీసుల వివరాల మేరకు.. వరికుంటపాడు మండలానికి చెందిన ఓంకార్‌రెడ్డి అనే యువకుడు సంగం వైపు నుంచి ఆత్మకూరుకు వెళ్తూ మార్గమధ్యలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓంకార్‌కు తీవ్ర గాయాలైనయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి గాయపడిన యువకుడిని 108 వాహనంలో ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. యువకుడు ఆత్మకూరు మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలు

వెంకటాచలం, మే 20 : మండలంలోని కాకుటూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. గూడూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు, అదే మార్గంలో వెళ్తున్న లారీ క్రాస్ చేసుకునే క్రమంలో లారీ డివైడర్‌పైకి దూసుకెళ్లి ఒక పక్కకు ఒరిగింది. కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. అయితే లారీ వెనుక కొద్దిదూరంలో వెంకటాచలానికి చెందిన రైల్వేఉద్యోగి ఎద్దు అశోక్ మోటార్‌బైక్‌పై నెల్లూరుకు వెళ్తుండగా లారీ తగలడంతో బైక్ బోల్తాపడింది. దీంతో అశోక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకుటూరులో క్వార్ట్జ తవ్వకాల గొడవలు

వెంకటాచలం, మే 20 : మండలంలోని కాకుటూరు గ్రామంలో సోమవారం ఇరువురి మధ్య క్వార్ట్ తవ్వకాల లావాదేవిల్లో తలెత్తిన వివాదం గొడవలకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి. కాకుటూరు గ్రామానికి చెందిన ఒక వైసీపీ నేతకు మరికొందరితో గొడవలు చోటు చేసుకున్నాయి. ఇటీవల జిల్లాలో అక్రమంగా క్వార్ట్ తవ్వకాలు విపరీతంగా జరిగాయి. దీంతో ఇరువురికి తవ్వకాల వద్ద జరిగిన లావాదేవిల్లో గొడవలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికే ఇరువురి మధ్య పలుమార్లు గొడవలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. సోమవారం ఆ వైసీపీ నేత ఇంటి వద్ద మరోసారి గొడవలు జరగడంతో పోలీసులకు విషయం తెలిసి వెళ్లగా అప్పటికే గొడవలు సద్దుమణిగిపోయాయి. దీనిపై పోలీసులను వివరణ కోరగా క్వార్ట్ తవ్వకాల గొడవ కాదని, పిల్లల మధ్య చోటుచేసుకున్న చిన్నపాటి గొడవలు అన్ని సమాధానమిచ్చారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం.. కేసు నమోదు

కొండాపురం, మే 20: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరును సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ మహేంద్ర కథనం మేరకు, భీమవరప్పాడుకి చెందిన కే రఘు ఉప్పుటేరు నుంచి ట్రాక్టరులో ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ట్రాక్టరును సీజ్ చేయడంతోపాటు ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య : అనుమానాస్పద మృతిగా కేసు

బుచ్చిరెడ్డిపాళెం, మే 20: ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని పెనుబల్లి అరుంధతి వాడలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుని బంధువుల వివరాల మేరకు... అరుంధతి వాడలో ఉంటున్న కొంగి శేషయ్య కుటుంబ సభ్యులంతా ఆదివారం రాత్రి ఇంటి మిద్దెపైన నిద్రించారు. సోమవారం వేకువనే నిద్రలేచిన శేషయ్య పొలానికెళ్తూ ఇంట్లోకెళ్లి గది తలుపులు తెరిచేసరికి కొడుకు కొంగి హేమంత్ (24) తాడుతో ఉరేసుకుని ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. దీంతో వెంటనే తాడును కోసి కిందికి దించగా అప్పటికే హేమంత్ మృతిచెందాడు. హేమంత్ శరీరంపై గాయాలు, మర్మావయవాల నుంచి రక్తస్రావం కావడం గుర్తించిన బంధువులు ఏదో జరిగిందన్న అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తండ్రి కొంగి శేషయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. కాగా, మృతుడు హేమంత్ వద్ద కుటుంబ సభ్యులకు ఓ లేఖ దొరికింది. ఆ లేఖలో అమ్మా... జాగ్రత్త.. సరేనా.. బాయ్ అంటూ రాసివుండడం బంధువులు, స్నేహితులను ప్రశ్నార్థకంలో పడేసింది.

ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని ఫిర్యాదు

కావలి రూరల్, మే20: పట్టణంలోని వాయునందనప్రెస్ వీధిలో ఓ యువకుడు ప్రేమ పేరుతో తరచూ అదే వీధికి చెందిన ఒక యువతిని వేధిస్తున్నట్లు సోమవారం రాత్రి ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల కథనం మేరకు, గత కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధించటంతోపాటు సోమవారం సాయంత్రం ఆ యువతి ఇంటికి చాకుతో వెళ్లిన ఆ యువకుడు నన్ను ప్రేమిస్తావా.. లేదా? నాతో మాట్లాడతావా.. లేక చావమంటావా ? అని బెదిరించాడని ఆ యువతి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(వ్యవసాయం), మే 20 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలను భద్రపరచిన స్ట్రాంగ్ రూములను సోమవారం కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతిరోజు ఈవీఎంల స్ట్రాంగ్ రూములను తనిఖీ చేయాల్సి ఉండడంతో కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమును, అక్కడి సీసీ టీవీల ద్వారా మానిటరింగ్ చేస్తున్న కంట్రోలు రూమును కూడా పరిశీలించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించేందుకు కళాశాల ప్రాంగణంలో సీసీ టీవీలను కూడా ఏర్పాటు చేశారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	172
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	300
స్కిన్‌లెస్	330
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7115
వెండి కిలో ధర	రూ. 95,300
వెండి ఒక గ్రాము	రూ. 97.30

1న కళాశాలల హాస్టళ్లు ప్రారంభించాలి

నెల్లూరు(వీఆర్సీ), మే 20 : జిల్లాలోని బీసీ కళాశాలల వసతి గృహాలను జూన్ 1వ తేదీన ప్రారంభించాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వై వెంకటయ్య సోమవారం ఆదేశించారు. కళాశాలలు జూన్ 1న ప్రారంభించనున్న నేపథ్యంలో వసతిగృహాలు తెరిచి, విద్యార్థులకు అందుబాటులో కి తీసుకురావాలని కళాశాల హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు సమాచారం అందించారు. కాగా, ప్రీ మెట్రిక్ హాస్టల్స్‌ను జూన్ 12న ప్రారంభించనున్న నేపథ్యంలో హాస్టల్ వార్డెన్‌లు విద్యార్థులను హాస్టల్ బాట పట్టించేందుకు ముందస్తు చర్యల నిమిత్తం జూమ్ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వై వెంకటయ్య తెలిపారు. ప్రతి హాస్టల్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యార్థులను చేర్పించేందుకు చర్యలు తీసుకునేలా ఈ సమావేశంలో ఆదేశాలిస్తామన్నారు.

వన్నె తగ్గిన ఇంటర్!

ఇంటర్ విద్య అమలులో లోపాలు, అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల లేమి తదితర సమస్యలు విద్యార్థులను వేధిస్తోంది. విద్యార్థుల ఉన్నతికి తోడ్పడే కోర్సులు అందుబాటులో లేకపోవడంతో చాలామంది రాణించలేకపోతున్నారు. ఇంటర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలోని పరిస్థితులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

- ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతుల లేమి!
- వేధిస్తున్న అధ్యాపకుల కొరత
- మధ్యాహ్న భోజనానికీ మంగళం
- పాఠ్య పుస్తకాలు లేకుండానే చదువులు

పబ్లిక్ పరీక్షల ఫలితాలపై ప్రభావం చూపుతున్న వైనం

నెల్లూరు (విద్య), మే 20 : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు మొత్తం 174 ఉన్నాయి. వీటిలో 116 ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ఉండగా, 26 ప్రభుత్వ, 11 ఎయిడెడ్, 7 మోడల్, 11 సోషల్ వెల్ఫేర్, 1 ఏపీ రెసిడెన్షియల్, 2 ట్రైబుల్ వెల్ఫేర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో 59,406 మంది విద్యార్థులు చదువుతున్నారు. జనరల్ విభాగంలో 14 కోర్సులు అమలవుతున్నాయి. 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు ఎయిడెడ్ కళాశాలలు, నాలుగు ప్రైవేటు కళాశాలల్లో ఒకేషనల్ (వృత్తి విద్య) కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇంటర్ కళాశాలల్లో 100 మంది రెగ్యులర్ అధ్యాపకులు, 231 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు పని చేస్తున్నారు. ఒకేషనల్ కోర్సుకు ఒకే ఒక్క రెగ్యులర్ అధ్యాపకుడు ఉండగా 58 మంది ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్నారు. రెగ్యులర్ ఇంటర్మీడియట్, ఒకేషనల్‌కు కలిపి 34 మంది గెస్ట్ ఫ్యాకల్టీతో నెట్టుకొస్తున్నారు. జిల్లాలోని 58 ప్రభుత్వ కళాశాలలు, 10 మోడల్ స్కూల్స్‌లో ఇంటర్ విద్యను అందిస్తున్నా ఒక్క మోడల్ స్కూల్స్ మినహా మిగిలిన వాటిల్లో మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రతి సంవత్సరం పదోతరగతిలో వేల సంఖ్యలో విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తున్నా ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. పలు మండలాల్లో జూనియర్ కళాశాలలు అందుబాటులో లేకపోవడం, ఉన్న ప్రాంతాల్లో సరైన వసతులు లేక ఇబ్బంది అయినా ప్రైవేటు వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అధికశాతం శిథిలావస్థకు చేరుకున్న గదుల్లోనే బోధన సాగిస్తుండటం దురదృష్టకరం. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో కూడా ప్రభుత్వ కళాశాలలు ఉత్తీర్ణత శాతాన్ని పెంచలేకపోవడం కూడా ఇందుకు ప్రధాన కారణంగా నిలుస్తోంది.



● పాఠ్య పుస్తకాలు లేకుండానే..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని బైజూస్ కంటెంట్ పాఠాలు, టోఫెల్ పరీక్షలంటూ ఆడంబరాలు కనబరిచిన వైసీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యలో కనీసం పాఠ్యపుస్తకాలు కూడా అందించకుండానే ఐదేళ్లు గడిపేసింది. గత టీడీపీ ప్రభుత్వంలో మధ్యాహ్న భోజనం అందిస్తుండగా దీనికి కూడా మంగళం పాడేసింది. 2019లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థుల నుంచి రూ.1600, హెచ్‌ఈసీ, సీఈసీ విద్యార్థుల నుంచి రూ.800 ప్రవేశ రుసుము ఉండేది. గత ఏడాది రూ.2,150, రూ.850 చొప్పున తీసుకోగా ఈ ఏడాది సైన్స్ గ్రూపులకు రూ.2,200, ఆర్ట్స్ గ్రూపులకు రూ.1,300 తీసుకుంటుండటంతో పేద విద్యార్థులకు భారంగా మారుతున్నాయి. అలాగే పాఠ్యపుస్తకాల సరఫరాను కూడా నిలిపివేయడంతో పుస్తకాలు లేకుండా విద్యార్థులు చదువులు పూర్తి చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతుల కల్పనను కూడా మెరుగు పరిస్తే అడ్మిషన్లు పెరుగుతాయని విద్యా ప్రముఖులు చెపుతున్నారు.

ఏళ్లుగా మారని కోర్సులు

అన్ని యాజమాన్యాల పరిధిలో ఇంటర్ విద్యలో జనరల్, వృత్తివిద్యాకోర్సులు అమలవుతున్నాయి. ఇవన్నీ ఎన్నో ఏళ్ల క్రితం బోర్డు ప్రారంభంలో ప్రవేశపెట్టగా నేటికీ వాటినే కొనసాగిస్తున్నారు. కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. అయితే చాలామంది విద్యార్థుల్లో నైపుణ్యాల లేమి, భాషా నైపుణ్య లోపాలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకోలేకపోతున్నామన్న ఆత్మన్యూనతా భావం వేధిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇంటర్మీడియట్ ఫలితాలను చూస్తే మొదటి సంవత్సరంలో 60శాతానికి మించడం లేదు. ద్వితీయ సంవత్సరంలో పరిశీలిస్తే 70-75శాతం మధ్యలోనే ఉంటోంది. కళాశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం, రెగ్యులర్ అధ్యాపకుల కొరతతో కాంట్రాక్ట్ అధ్యాపకులే పాఠాలు బోధిస్తుండటం, కొన్ని సబ్జెక్ట్‌లకు అధ్యాపకులు లేకపోవడం వంటి సమస్యలు జిల్లాలో నెలకొని ఉన్నాయి..

పెట్టుబడీ రాని పత్తి

- ఈ ఏడాది అంతంత మాత్రంగా దిగుబడి.. ధరలు
- ఎకరాకు 10 క్వింటాళ్లకు మించని దిగుబడి
- క్వింటం రూ.7వేలూ పలకని ధర

ఈ ఏడాది పత్తి సాగు చేసిన రైతులకు ఆశించిన దిగుబడి.. ధర లేక తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని ఇస్కపల్లి, ఆమనిచిరివేళ్ల, గౌరవరం, మంగుపల్లి, బొమ్మవరం, చాపురాళ్లపల్లి, గోగులపల్లి గ్రామాల్లో విస్తారంగా ఈ పంటను సాగు చేశారు. గతేడాది ఈ సీజన్‌లో క్వింటం రూ.10 వేల నుంచి రూ.12వేల ధర పలికింది. ఈ ఏడాది రూ.6వేల నుంచి రూ.6500కు మించలేదని రైతులు వాపోతున్నారు. ఎకరం సాగునకు అన్ని ఖర్చులు కలిపి రూ.40 వేలు పెట్టుబడి అవుతుండగా, దిగుబడి ఎకరాకు 10 క్వింటాళ్లకు మించకపోవడంతో సాగుదారుల్లో ఆందోళన నెలకొంది. కొన్ని చోట్ల సగటు దిగుబడి కూడా రావడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది. పత్తి సాగు కోసం పడిన కష్టానికి తగ్గ ఫలితం లేక శ్రమ మిగులుతుందని ఆవేదన చెందుతున్నారు. ఈ దఫా నీటి వనరుల్లో సమృద్ధిగా నీరు లేక వరికి బదులు బోర్ల కింద పత్తి సాగు చేశామని గిట్టుబాటు ధరలు లేక కొందరు ఇళ్లలో దిగుబడిని నిల్వ చేసుకున్నారు. మార్కెట్‌లో మాత్రం పత్తికి గిరాకీ ఉన్నా వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ధరను తగ్గిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు.

- అనంతసాగరం



గిరిజన గురుకులంలో ప్రవేశానికి రేపు కౌన్సెలింగ్

నెల్లూరు(వీఆర్సీ), మే 20 : నెల్లూరు ఐటీడీఏ పరిధి లోని తిరుపతి జిల్లా కోట మండలం చిట్టేడు గిరిజన గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 22న కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల మెరిట్ జాబితా తయారైందని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40, హెచ్‌ఈసీ 40, ఒకేషనల్ కోర్సుల్లో 20 సీట్లు ఉన్నాయని తెలిపారు. వీటికి అదనంగా చిత్తూరు జి ల్లాకు చెందిన గిరిజన (యానాది) విద్యార్థులకు 5 సీట్లు కేటాయించారని తెలిపారు. మెరిట్ జాబితా ప్రకారం విద్యా ర్థులకు సమాచారం అందించామని పేర్కొన్నారు. కౌన్సెలిం గ్‌కు హాజరయ్యే విద్యార్థులు 10వ తరగతి మార్కులు జాబితా, కుల, ఆదాయ, నివాస, ఆధార్‌తో పాటు టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, పాస్‌పోర్టుసైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. అదనంగా సర్టిఫికెట్ జెరాక్స్ కాపీలను వెంట తీసుకురావా లని కోరారు. ఇతర వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్ 94410 33367ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎక్కడైనా ఆర్థిక వనరులు సమకూర్చుకుని తద్వారా అవసరమైన చిన్న చిన్న అవసరాలు తీర్చుకుంటారు. అయితే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లో ఉన్న ఆర్థిక వనరులను వినియోగించుకోకుండా నిరుపయోగం చేస్తున్నారు. అందుకు ఉదాహరణే గత మూడేళ్లుగా అద్దె గదులు రోగులకు కేటాయించకుండా వదిలేయడం. వాటి నిర్వహణ బాధ్యతలను కూడా అధికారులు విస్మరించటంతో గదులలో చెత్తాచెదారం పేరుకుని అస్తవ్యస్తంగా ఉన్నాయి.

అద్దె గదులు ఇవ్వరా!?

- జీజీహెచ్‌లో మూడేళ్లుగా నిరుపయోగం
- రోగులకు కేటాయింపులో అలసత్వం
- నిర్వహణ లేక అస్తవ్యస్తం
- ఆసుపత్రికి సమకూరని రాబడి

నెల్లూరు(వైద్యం), మే 20: ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మొత్తం 60 అద్దె గదులు ఉన్నాయి. అందులో ప్రసూతి ఆసుపత్రిలో ఉన్న 8 అద్దె గదులను మాత్రం ఆ ఆసుపత్రి నిర్వాహకులు రోజుకు రూ.250కు కేటాయిస్తున్నారు. జీజీహెచ్ ఐపీ బ్లాక్‌లో 52 అద్దె గదులు ఉన్నాయి. వీటిని కూడా అవసరమైన రోగులకు కేటాయిస్తే ఆసుపత్రికి ఆదాయ వనరులు సమకూరుతాయి. పైగా ఈ గదులన్నింటిలో ఏసీలు ఉన్నాయి. ప్రత్యేకంగా టాయిలెట్లు ఉన్నాయి. వేడి నీళ్లకు గీజర్‌లు ఏర్పాటు చేశారు. మెరుగైన వసతులు ఉన్న ఈ అద్దె గదులను గత కొంతకాలంగా ఎవ్వరికి కేటాయించటం లేదు. ఇవి అందుబాటులోకి వస్తే రోగులు రోజుకు రూ.400 అద్దె చెల్లించినా రూ.20వేలకుపైగా ఆదాయం వస్తోంది. అయితే ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. అయితే 7 నెలల క్రితం జీజీహెచ్‌కు కొత్తగా వచ్చిన వైద్యులలో కొందరికి ఈ గదులను అధికారులు కేటాయించారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో వెంటనే వారిని ఖాళీ చేయించారు. ఇదిలా ఉండగా గదులలో ఉన్న ఏసీలు, పడకల నిర్వాహణను అధికారులు, సిబ్బంది పూర్తిగా విస్మరించటంతో అవి కొంత వరకు దెబ్బతింటున్నాయి. ఆయా గదులలో గచ్చు కూడా దెబ్బతిని పెచ్చులు ఊడుతున్నాయి. గదుల నిర్వాహణపై గతంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో జరిగిన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలు నేటికీ అమలు కాలేదు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఉన్నా గదుల నిర్వాహణపై ఒక నిర్ణయం తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రికి వచ్చే ఎంతో మంది రోగులు ఈ అద్దె గదులలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నా వీటిని కేటాయించేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. ఆయా గదులలో ఏసీలు, పడకలు బాగుచేసి వినియోగంలోకి తేవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



అందుబాటులోకి తెస్తాం

ఆసుపత్రిలో అద్దె గదులు నిరుపయోగంగా ఉన్నమాట వాస్తవమే. అన్ని సదుపాయాలు ఉన్న ఆ గదులను శుభ్రపరిచి, ఏసీలు, పడకలు బాగు చేయించి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తాం. రోగులు ఆయా గదులపై పెద్దగా ఆసక్తి చూపడం లేదన్న వాదన కూడా ఉంది, అయినా వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ సిద్ధానాయక్, సూపరింటెండెంట్, జీజీహెచ్



అంగన్‌వాడీలు తెరవకుంటే చర్యలు : పీడీ

నెల్లూరు(వీఆర్సీ), మే 20 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు తెరువకుండా, పిల్లలకు పౌష్టికాహారం అందించ కుండా ఉన్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. సమయపాలన పాటించాలంటూ సిబ్బందికి కచ్చితమైన ఆదేశాలు జారీ చేశామని పేర్కొ న్నారు. ఆంధ్రజ్యోతిలో పౌష్టికాహారం అందలేదనే వార్త ప్రచురమైన సంగతి విదితమే. ఈ మేరకు ఆమె ఈ ప్రకటన విడుదల చేస్తూ కార్యకర్తలు, ఆయాల వద్ద ఎవరు కూడా ఎలాంటి డబ్బులు తీసుకో వడం లేదని, అది అవాస్తవమని తెలిపిన ఆమె అలాంటి ఒప్పందా లు ఎవరైనా చేసుకుని ఉంటే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

వసూళ్లు నిజమేనా?


ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- 'ఒట్టా.. వాపసా'పై చెంచుగానిపాలెంలో అధికారుల విచారణ
- స్టేట్‌మెంట్ కోసం స్టేషన్‌కు వృద్ధుల తరలింపు
- తప్పుడు కథనంగా చిత్రీకరణకు ఎమ్మెల్యే వర్గం యత్నం

కావలి రూరల్, మే 20: కావలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డికి ఓటు వేయాలని చెంచుగానిపాలెంలో వృద్ధులకు ఇచ్చిన నగదు వాపస్ తీసుకోవటంపై ఆంధ్రజ్యోతిలో సోమవారం 'ఒట్టా .. వాపసా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా ఉన్నతాధికారుల ఆదేశానుసారం వీఆర్వో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, మహిళా పోలీసు సుహాసిని, తదితరులు సోమవారం గ్రామంలోని వృద్ధుల ఇళ్లకు వెళ్లి విచారణ చేపట్టారు. ఈ కథనంపై వైసీపీ నేతలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. దీంతో విచారణ అధికారుల కంటే ముందుగానే వృద్ధుల ఇళ్లకు వెళ్లిన ఎమ్మెల్యే అనుచరులు, స్థానిక వైసీపీ నేతలు వాస్తవాలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. విచారణ సమయంలో అక్కడకు చేరుకున్న రూరల్ పోలీసులు వారిని భయపెట్టేందుకు స్టేట్‌మెంట్ రికార్డు పేరుతో అనారోగ్యంతో ఉన్న వృద్ధుడిని సైతం వాకర్ సాయంతో ఆటోలో ఎక్కించుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎన్నడూ పోలీస్ స్టేషన్ గడప తొక్కని దద్దాల శాంతమ్మ, పోసిన రమణమ్మ, ఉప్పాల పోలయ్యను స్టేషన్‌కు తీసుకువచ్చి స్టేట్‌మెంట్ రికార్డు చేయించారు. దీంతో వారు పోలీసులకు భయపడి వాస్తవాలను చెప్పేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం వారిని స్వగ్రామానికి పంపారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ఆటోలో వృద్ధుడు పోలయ్య



'స్వచ్ఛత' లక్ష్యానికి తూట్లు!

- తుప్పు పడుతున్న బ్యాటరీ ఆటోలు, రిక్షాలు, రీ సైక్లింగ్ యంత్రాలు
- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు
- రూ. లక్షల ప్రజాధనం దుర్వినియోగం



ఉదయగిరిలో తుప్పుపట్టిన బ్యాటరీ ఆటోలు

ఉదయగిరి, మే 20: గత టీడీపీ ప్రభుత్వహయాంలో స్వచ్ఛ భారత్ పేరుతో అన్ని పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసి, చెత్త తరలింపునకు బ్యాటరీ ఆటోలు, రిక్షాలు, రీసైక్లింగ్ యంత్రాలను మంజూరు చేసింది. చెత్త సంపద కేంద్రాల నిర్వహణ బాధ్యతలను గ్రామ సర్పంచ్‌లకు అప్పగించింది. నిర్వహణకు నిధులు మంజూరు చేసేది. ఇలా ఉదయగిరి మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో లక్షలు వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే చెత్తను కేంద్రాలకు తరలించేందుకు బ్యాటరీ ఆటోలు, రిక్షాలు లక్షల నిధులు వెచ్చించి పంచాయతీలకు అప్పగించారు. చెత్త సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆర్థిక భరోసా వస్తుందనే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే నేడు వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇవి వినియోగంలో లేక శిథిలావస్థకు చేరాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ హరిత రాయబారులు చెత్తను రిక్షాలతోనే సేకరిస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలు పూర్తిగా నిరుపయోగంగా మారడంతో చెత్తను రోడ్ల వెంబడి పడేస్తున్నారు. ఆటోలను మరమ్మతులు చేయించి గ్రామ పంచాయతీలకు అప్పగించి వినియోగంలోకి తీసుకొస్తే పథకం లక్ష్యం నెరవేరుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



చెదలు పట్టిన రీసైక్లింగ్ యంత్రాలు

నేడు దుత్తలూరు మండల సమావేశం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), మే 20: స్థానిక సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం



వింజమూరులో కేక్ కట్ చేస్తున్న జూ.ఎన్టీఆర్ అభిమానులు

వింజమూరు, మే 20: పట్టణంలోని వాసు సెల్యూన్ ప్లాజా వద్ద నందమూరి తారకరామారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమాని నీలం బాసు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కోసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం స్థానికులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా నీలం వాసు మాట్లాడుతూ మా అభిమాన నాయకుడి జన్మదిన వేడుకలను అభిమానుల సహకారంతో జరుపుకోవడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు బ్రహ్మయ్య, రాకేష్, శివశంకర్‌రెడ్డి, రామకృష్ణ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మహేష్, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేమిరెడ్డి, కాకర్ల గెలుపు తథ్యం

సీతారామపురం, మే 20: ఈ మారు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం విజయం సాధించడం ఖాయమని మండల సీనియర్ నాయకులు తమ్మిశెట్టి రమణయ్య, కిష్ట సుబ్బరాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెచ్చిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఒక్క పేదవాడికి లబ్ధి చేకూరుతుందన్నారు. 4వ తేదీ వచ్చే పోలింగ్ ఫలితాల్లో తెలుగుదేశం 126 స్థానాల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు అవుతారని జోస్యం చెప్పారు. అలాగే నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్ ప్రమాణ స్వీకారం చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు చేసిన సేవా కార్యక్రమాలే వారిని గెలిపిస్తాయన్నారు.

ఉచిత ఒడుగుల కార్యక్రమం

ఉదయగిరి రూరల్, మే 20: స్థానిక ప్రగతి జూనియర్ కళాశాల ఆవరణలో రహమతుల్‌లిల్ ఆలమీన్ ట్రస్టు, చిన్న మసీదు ఆధ్వర్యంలో సోమవారం ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగుల (ఖత్నా) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 80 చిన్నారులకు ఖత్నా చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఏ వహీద్, దస్తగిరి అహ్మద్, యస్తాన్, ఉమాయిన్, జాఫర్‌మొహిద్దీన్, చిన్న మసీదు ట్రస్టు నిర్వాహకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఉదయగిరిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఉదయగిరి రూరల్, మే 20: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని మెయిన్‌బజార్, పంచాయతీ బస్టాండ్, సినిమాహాలు వీధి, హరిజనపాళెం ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాలు, ఘర్షణలకు దిగరాదన్నారు. అనంతరం ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణపై అవగాహన కల్పించారు.

మద్యం దుకాణాల వేళలు మార్పు

ఉదయగిరి రూరల్, మే 20: ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణ సమయాలను మార్పు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ పీర్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం మద్యం దుకాణాలు ఉదయం 11నుంచి రాత్రి 9గంటలకు నడుస్తున్నట్లు చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 11నుంచి రాత్రి 8గంటల వరకే కొనసాగుతాయన్నారు.

వైభవంగా హనుమంత సేవ

సీతారామపురం, మే 20: పంద్రంగి సమీపంలోని పాండురంగ విఠలేశ్వర స్వామి హనుమంత సేవ, ధ్వజారోహణం సోమవారం రాత్రి కనుల పండువగా సాగింది. పరమటి వీధి నుంచి కోటవీధి మీదుగా జెండాను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు.



జెండాను ఊరేగిస్తున్న భక్తులు

సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ



మాట్లాడుతున్న సహాయ వ్యవసాయ సంచాలకులు దేవ సేనమ్మ

ఉదయగిరి, మే 20: మండల రైతులకు 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు అందుబాటులో ఉన్నట్లు సోమవారం మండల వ్యవసాయాధికారి అంజనేయులునాయక్ తెలిపారు. పది కేజీల జీలుగలు, జనుములు రూ.440లు చెల్లించి రైతుభరోసా కేంద్రాల్లో పొందవచ్చు అన్నారు. ఎకరాకు ఒక సంచి పచ్చిరొట్ట ఎరువులు తీసుకోవాలని, ప్రతి రైతుకు ఐదెకరాల వరకు పంపిణీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆత్మకూరు: వాశిలి, వెంకట్రావుపల్లి రైతుభరోసా కేంద్రాల్లో సోమవారం భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకురాలు దేవసేనమ్మ మాట్లాడారు. భూసార పరిరక్షణకు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ, జీవ ఎరువుల వాడకం పెంచుకోవాలన్నారు. వివిధ పంటల్లో విచక్షణారహితంగా రసాయన ఎరువులు వాడకుండా పశువుల ఎరువు, అజోస్పైరిలింగ్ వాడడంతో భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కిషోర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మర్రిపాడు: పీఎం ప్రాణం పథకంపై సోమవారం భీమవరంలో మండల వ్యవసాయాధికారి రామ్మోహన్ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూసార సంరక్షణకు రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు వేసుకొని భూసారం పెంచుకోవాలని తెలిపారు. పచ్చి రొట్ట ఎరువులు కావాల్సిన రైతులు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు రిజిస్టర్ చేసుకొని పొందాలన్నారు. జీలగలు, పిల్లిపెసర విత్తనాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పెంచలయ్య, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ డీఈవో గోపాల్



డిప్యూటీ డీఈవో గోపాల్‌ను సన్మానిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

ఆత్మకూరు, మే 20: ఆత్మకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో గోపాల్ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పట్టణంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఇన్‌చార్జ్ డిప్యూ డీఈవోగా ఉన్న రఘురామయ్య ఆయనకు బాధ్యతలు అప్పగించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గోపాల్ ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామవాసి. ఆయన నెల్లూరు విద్యాశాఖ కార్యాలయంలో సూపరిండెండెంట్‌గా పనిచేస్తూ నంద్యాల జిల్లా ఏడీగా పదోన్నతిపై వెళ్లారు. అక్కడ నుంచి ఆత్మకూరుకు మొదటి ఉపవిద్యాశాధికారిగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆత్మకూరు డివిజన్‌లో విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎంఈవో నజీర్‌బాషా, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఆత్మకూరు డివిజన్ పరిధిలోని మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సన్మానించి అభినందలు తెలిపారు.

సాగరంలో తీరని ట్రాఫిక్ సమస్య



రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉంచిన వాహనాలు

అనంతసాగరం, మే 20: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యాపార సముదాయాలు, వైన్‌షాపు వద్ద సాయంత్రం పూటరద్దీ నెలకొంటుంది. ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలను నిలుపుతున్నారు. దీంతో స్థానికుల రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితి నెలకుంటుంది. అసలే రోడ్డు మీదకు ఆక్రమణలు చొచ్చుకొని వచ్చి వుండగా దానికి తోడు వాహనాలు అడ్డగోలుగా పెడుతుండడంతో అసౌకర్యం కలిగిస్తుందని వాపోతున్నారు. పోలీసులు ఈ విషయంపై దృష్టి సారించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీటి వృథా పట్టదా..?



ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయ సమీపంలో లీకేజీతో వృథాగా పోతున్న నీరు

ఉదయగిరి రూరల్, మే 20: పట్టణంలో తాగునీటిని సరఫరా చేసే పైపులు ధ్వంసం కావడం, కొళాయిలకు డమ్మీలు లేకపోవడం, వాల్వులు, సింథటిక్ ట్యాంకుల వద్ద లీకేజీలు ఉండటంతో నీరంతా వృథా అవుతోంది. ఈ సమస్యతో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. ప్రధానంగా మెయిన్‌బజార్, అగ్రహారం, నాగులబావి వీధి, కోళ్ల వీధి, చిన్నమసీదు, అటవీశాఖ కార్యాలయం, యాదవపాళెం, వాయుగండ్లవారి వీధి తదితర ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. గత కొంతకాలంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి నీటిని వృథాను అరికట్టేం దుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చేతిబోర్లు, వాటర్‌ప్లాంట్ వద్ద నీరు వృథా.. !

ఆత్మకూరు: నియోజకవర్గ పరిధిలో 17,917 చేతిపంపులున్నాయి. ఆత్మకూరు మండలంలో 256 బోర్లు, ఏఎస్‌పేటలో 456, అనంతసాగరంలో 548, మర్రిపాడులో 725, చేజర్లలో 466, సంగం మండలంలో 224 బోర్లు ఉన్నాయి. వీటితో ప్రజలు తాగునీరు, ఇతర అవసరాలను తీర్చుకుంటున్నారు. చేతిపంపు కొట్టేటప్పుడు బిందెలు నిండిన ప్రతిసారీ కొంతనీరు వృథా అవుతుంది. ఆ నీరు మురుగు కాలువల్లోకి లేక వృథాగా బోరు చుట్టూ చేరుతుంది. పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ప్రతిబోరు ద్వారా ఒకరోజుకు 30లీటర్ల నీరు వృథా అవుతోంది. ఈ లెక్కన నియోజకవర్గం మొత్తం మీద ప్రతిరోజు 1.5లక్షల లీటర్ల నీరు వృథాగా పోతుంది. ఇందులో భూగర్భంలోకి ఇంకేది 20శాతం కంటే తక్కువే. మిగిలిన నీరంతా వృథా అవుతుంది. అలాగే ప్రతి చేతిపంపు వద్ద ఇంకుడుగుంతను ఏర్పాటు చేయగలిగితే వృథా అవుతున్న నీటిని భూగర్భంలోకి పంపవచ్చు. ఇలా చేస్తే భూగర్భజలాలు పుష్కలంగా పెరిగే అవకాశం ఉంది. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మినరల్‌వాటర్ ప్లాంట్ల వద్ద ప్రతిరోజూ ఫిల్టర్ అయిన నీరు వృథాగా పోతుంది. జిల్లా మొత్తం ఉన్న వాటర్‌ప్లాంట్లతో ప్రతిరోజూ వృథా అయ్యే నీరు ఓ అంచనా ప్రకారం 5 లక్షల లీటర్లకు పైగా ఉండవచ్చు. ప్రతి వాటర్‌ప్లాంట్ వద్ద ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయడంతో వృథా నీటిని భూగర్భంలోకి పంపి నీటి వనరులను పెంచుకోవచ్చు. ప్రతి ఇంట్లో ఓ ఇంకుడుగుంత, ప్రతి పొలంలో ఓ పారంపాండ్ లాగే ప్రతి చేతిపంపు, ప్రతి మినరల్‌వాటర్ ప్లాంట్ వద్ద ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసేలా అధికారులు, పాలకులు చొరవ చూపాల్సిన ఎంతైనా ఉంది.

కందుకూరులో కొనుగోళ్ల సందడి !

- హోమ్‌నీడ్స్, ఎలక్ట్రానిక్స్ దుకాణాలు కళకళ
- గృహోపకరణాల కొనుగోలుకు జనం క్యూ



ఓ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో కొనుగోలుదారుల సందడి

కందుకూరు, మే 20: ఎన్నికల హడావిడి ముగిసి వారమైంది. కందుకూరులో గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్ల దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. రెండునెలలుగా ఎన్నికల సందడితో రాజకీయ పార్టీల కార్యాలయాలు, రచ్చబండల వద్ద కనిపించిన జనం ఎన్నికలు ముగిసిన నాటి నుంచి వివిధ దుకాణాల్లో కనిపిస్తున్నారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే కొనుగోళ్లు పెరగటం వెనుక బలమైన కారణం ఉంది. ఎన్నికల సందర్భంగా ఇరుపార్టీల నేతలు విచ్చలవిడిగా నగదు పంచటమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థులు సుమారు రూ. 80 కోట్లపైగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేశారు. ఇరుపార్టీలు కూడా గ్రామీణ ప్రాంతంలో ఓటుకు రూ. 2వేలు, కందుకూరులో ఓటుకు 3వేలు వంతున ఇచ్చారు. దీంతో ఒక ఇంట్లో 10 ఓట్లు ఉంటే వారు ఒకరి వద్దే డబ్బు తీసుకుంటే రూ. 20వేలు, ఇద్దరి వద్ద చేయి చాపితే రూ. 40 వేలు ఆయాచితంగా వచ్చేశాయి. మధ్యతరగతి, నిరుపేద కుటుంబాల్లో ఐదారు ఓట్లు ఉన్న కుటుంబాలు ఎక్కువగా ఉండటంతో ఒక్కో కుటుంబానికి రూ. 20 నుంచి పాతికవేలు వచ్చేశాయి. హీనంగా వేసుకున్నా చిన్న కుటుంబానికి కూడా పదివేలుకు తక్కువ కాకుండా ముట్టాయి. ఒక్కసారిగా వేలల్లో డబ్బు రావటంతో ఏదైనా వస్తువు కొనుక్కుంటే బాగుంటుందన్న ఆలోచనతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆయా దుకాణాలకు క్యూ కడుతున్నారు. వేసవి కావటంతో ఏసీలు, కూలర్లు,ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు లాంటి గృహోపకరణాలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. కొందరు 5జీ సెల్‌ఫోన్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఇంట్లోకి అవసరమైన కుర్చీలు, సోఫాలు, డైనింగ్ టేబుళ్లను మరికొందరు కొనుగోలు చేస్తున్నారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు : ఏవో



కందుకూరు : మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి రాము

కందుకూరు, మే 20: భూసార రక్షణకోసం రైతులు విస్తారంగా పచ్చిరొట్ట పైర్లు సాగుచేయాలని, రైతులకు 50 శాతం సబ్సిడీపై అందించేందుకు పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి వీ. రాము తెలిపారు. పీఎం-ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాచవరం, మోపాడు గ్రామాల్లో సోమవారం భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి భూమిలో కలియదున్నటం ద్వారా భూసారాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సీహెచ్ రోనీ రేచల్, ఈ రమణయ్య పాల్గొన్నారు.

- **నేటి నుంచి పచ్చిరొట్ట ఎరువుల వాడకంపై అవగాహన**

లింగసముద్రం : మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో పీఎం - ప్రణామ్ పథకం కింద మంగళవారం నుంచి ఈనెల 28వతేదీ వరకు పచ్చిరొట్ట ఎరువులు వాడకం పెంపు, భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి టీ అబ్రహం లింకన్ సోమవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, జిల్లా వనరుల కేంద్రం అధికా రులు పాల్గొంటారని ఆయన తెలిపారు. కాగా మండలానికి 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు మంజూరయ్యాయని వివరించారు.

- **పచ్చిరొట్టి విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి**

వలేటివారిపాలెం : ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్టి విత్తనాలకు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి హేమంత్ భరత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కావల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డ్, మొబైల్ నెంబర్‌తో ఆర్‌బీకేలో సంప్రదించాలన్నారు.

ఘనంగా జూ.ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



గుడ్లూరు : కేక్ కట్ చేస్తున్న జూ. ఎన్టీఆర్ అభిమానులు

గుడ్లూరు, మే 20 : సినీ నటులు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం గుడ్లూరులో ఆయన అభిమానులు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్లూరు మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం కేక్ కట్‌చేసి పంచారు. ఈ కార్యక్రమంలో జూ.ఎన్టీఆర్ అభిమానులు పారా అశోక్, కాపులూరి మధు, కర్పూరపు అజయ్‌కుమార్, వినోద్, చిత్తారి మల్లికార్జున, పాల్గొన్నారు.

కందుకూరు : సినీహీరో జూ. ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం కందుకూరులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఏరియా హాస్పటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కోవూరు రోడ్డులో ఉన్న స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారుల సమక్షంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారులకు భోజనం ఏర్పాటుచేయటంతోపాటు వారికి నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో జూ. ఎన్టీఆర్ అభిమాన యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

కావలి రూరల్, మే20: పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకట రమణ పేర్కొన్నారు. పట్టణంలోని వడ్డిపాలెంలో ఒకటవ పట్టణ సీఐ రాజేష్, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులతో ఇళ్లు, దుకాణాల్లో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం ప్రజల్లో భయాందోళనలు తొలగించేందుకు కార్డన్ సెర్చ్ సర్చి నిర్వహించామన్నారు. ఇస్లాంపేట ప్రజలు ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా తగు సూచనలిచ్చి సోదాలు చేశామన్నారు.

కలిగిరి : గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ సంతోష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గుడ్లదొనలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఫలితాలు విడుదలయ్యేంతవరకు గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు పర్యటించినా, కవ్వింపు చర్యలకు, కక్షసాధింపు చర్యలకు దిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నెలాఖరు వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు

ఉలవపాడు : కందుకూరు సబ్ డివిజినల్ పరిధిలో ఈనెల 31 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని కందుకూరు డీఎస్పీ ఏ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారని ఎస్సై బాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో చెప్పారు. ఎవరైనా వ్యక్తులు, వ్యవస్థలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, స్టూడెంట్స్ ఆర్గనైజేషన్స్ సభలు, సమావేశాలు ర్యాలీలు జరుపుకోవాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు

కావలి రూరల్, మే20: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ప్రశ్నపత్రాలు నెల్లూరు డీఈవో కార్యాలయం నుంచి సోమవారం కావలికి రాగా, వాటిని రూరల్ పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచినట్లు ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య తెలిపారు.ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

వలేటివారిపాలెం, మే 20: మండలంలోని రోళ్లపాడు గ్రామ శివార్లలోని పొలాల్లో పేకాట శిబిరంపై గుడ్లూరు సీఐ వీ. సుబ్బారావు తమ సిబ్బందితో సోమవారం దాడి చేసి 11 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ 73,230 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న పేకాటరాయుళ్లను కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ తెలిపారు.

పేదలకు బిర్యానీ పొట్లాల పంపిణీ

కావలిటౌన్, మే20: టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర మనవడు, ఎన్ఆర్ఐ మన్నవ అద్వైత్ చౌదరి జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కూడలిలో ఘనంగా జరిగాయి. ముందుగా కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, మాజీ కౌన్సిలర్లు కుందుర్తి కిరణ్, బిట్రగుంట శివ, టీడీపీ నేతలు కావేటి కోటయ్య, పల్లపు కుమార్, సుకుమార్, ఉప్పాల శ్రీను తలమంచి రవి తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

కందుకూరు: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ ఆలయానికి పట్టణానికి చెందిన లంకెనపల్లి వీరాచారి, రావమ్మ దంపతులు రూ. 10,116లను సోమవారం విరాళంగా అందజేశారు. ఆలయ పూజారి మాధవశర్మకు ఈ మొత్తాన్ని వారు అందించారు.

కుటుంబ వివాదంలో పోలీసుల జోక్యం

కావలి, మే20: తమ కుటుంబ వివాదంలో కావలి రూరల్ సీఐ శ్రీనివాసరావు జోక్యం చేసకుని తనను వేధిస్తున్నాడని కావలి రూరల్ మండలం రామచంద్రపురానికి చెందిన కోసూరి శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం ఆయన మాట్లాడారు. తన తండ్రి కోసూరు శేషయ్య కొద్ది రోజుల క్రితం ఒంగోలు రైల్వేస్టేషన్‌లో రైలుపట్టాలపై పడి చనిపోయారన్నారు. డెత్ సర్టిఫికెట్ తన దగ్గర ఉండటంతో దాని కోసం తన తల్లి బాలమ్మ,సోదరులు పోలీసుల ద్వారా వేధిస్తున్నారన్నారు. తనకు తెలయకుండా ఇప్పటికే రెండు ఎకరాల భూమి అమ్మివేశారని చెప్పారు. తన తండ్రిపేరుపై ఉన్న ఆస్తి కోసం డెత్ సర్టిఫికెట్ ఇవ్వాలని పోలీసులు ఒత్తిడి చేస్తూ అక్రమ కేసులు పెడతామని బెదిరిస్తున్నారన్నారు. కుటుంబ ఆస్తుల విషయంలో పోలీసుల జోక్యమేమిటని ఆయన ప్రశ్నిస్తున్నారు.

బంకులు, తోపుడుబండ్ల పంపిణీ

కందుకూరు : నిరుపేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా మలినేని చారిటబుల్ ట్రస్టు ద్వారా సోమవారం బంకులు, తోపుడుబండ్లను పంపిణీచేశారు. ట్రస్టు ఛైర్మన్ మలినేని లక్ష్మయ్య చేతుల మీదుగా కందుకూరుకి చెందిన ఇద్దరు నిరుపేద మహిళలకు రెండు బంకులు, మరో ఇద్దరు నిరుపేదలకు తోపుడుబండ్లు అందజేశారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ

కందుకూరు, మే 20: పట్టణంలోని శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు చేతిరాతపై పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకురాలు టీ. నాగరజని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు, ఆంగ్ల పాఠ్యపుస్తకాలలోని కొన్ని పేరాలను చూచిరాత రాయించటం ద్వారా ఈ పోటీలు నిర్వహించారు. పోటీల ముగింపు సందర్భంగా జూన్ 7న అత్యుత్తమ చేతిరాతను ప్రదర్శించిన ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వేసవి శిక్షణ శిబిరం సభ్యులు సీ. సుబ్బారావు, ఏవీఆర్ మూర్తి, జి. జయపాల్, సీ. రోశయ్య, సిహెచ్ సుబ్బారావు, ఎస్కే. బాషా, టి. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

జీతాలివ్వాలని స్కూల్ స్వీపర్ల వినతి



స్వీపర్లతో కలిసి ఎంఈవోతో మాట్లాడుతున్న పెంచలయ్య

కావలిటౌన్, మే20: నాలుగు నెలల పెండింగ్ జీతాలివ్వండి సార్... అంటూ ఎంఈవో గోవిందయ్యకు స్కూల్ స్వీపర్లు మొర పెట్టుకున్నారు. సోమవారం సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్యతో కలిసి వారు ఎంఈవోను కలిసి వినతిపత్రం అందించారు. పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే 26మంది స్వీపర్లు ప్రతినెలా జీతాలందితేనే కుటుంబాలు గడవడం కష్టంగా ఉంటుందని, నాలుగు నెలలనుంచి జీతాలివ్వకపోతే ఎలా బతకాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వీపర్ల జీతాలు పెంచి సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వీపర్ల యూనియర్ బాధ్యులు ఆదిలక్ష్మీ, పద్మ, సైదమ్మ, వై రామయ్య, శివ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జనసేన నుంచి సుధాకర్‌ను సస్పెండ్ చేయాలి

కావలి, మే20: జనసేన కావలి ఇన్‌చార్జిగా ఉన్న అళహరి సుధాకర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని జనసేన నాయకులు పేర్కొన్నారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం పార్టీ జిల్లా కార్యదర్శి సమ్మన వెంకటసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు పొబ్బా సాయి విఠల్, పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్‌లు విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలలో కావ్య క్రిష్ణారెడ్డి గెలుపుకోసం సుధాకర్ సహకరించలేదన్నారు. ప్రచారంలో పాల్గొనాలని ఆహ్వానం వచ్చినా, అవసరంలేదని జనసైనికులకు చెప్పారన్నారు. వైసీపీ అభ్యర్థితో లాలూచీ పడి ఆయనకు అనుకూలంగా పనిచేశారని ఆరోపించారు. కావున ఆయనపై విచారణ జరిపి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. సమావేశంలో జనసేన నేతలు, జనసైనికులు గాదంశెట్టి రవి, నాని, క్రిష్ణయ్య, మురళీకృష్ణ, వెంకటేశ్వర్లు, మహేంద్ర, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు ఓట్ల వినియోగానికి 4 వరకు అవకాశం

కందుకూరు, మే 20: నియోజకవర్గంలో ఉన్న సర్వీసు ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు జూన్ 4 ఉదయం 8 గంటల వరకు అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు కోరారు. నియోజకవర్గంలో 66 సర్వీసు ఓట్లు ఉండగా, ఇప్పటివరకు 23 ఓట్లు మాత్రమే పోస్టల్ ద్వారా ఎన్నికల అధికారులకు అందాయని, వాటిని సబ్ కలెక్టరు కార్యాలయంలోని స్ట్రాంగ్ రూంలో ఇరుపార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరచామన్నారు. మిగిలిన సర్వీసు ఓటర్లు కూడా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని డీటీవో ప్రసాద్ కోరారు.

అధికారుల మెప్పుకోసం పోలీసులు : భయాందోళనలో ప్రజలు

కావలి, మే20: పోలీసుల వ్యవహారశైలిపై ఎన్నికల కమిషన్ సీరియస్‌గా ఉండటంతో ఉన్నతాధికారుల మెప్పు కోసం దిగువస్థాయి పోలీసులు హడావుడి చేస్తున్నారు. దీంతో సామాన్యులు భయభ్రాంతులకు గురౌతున్నారు. కావలిలో కార్డన్‌సెర్చ్ పేరుతో సామాన్యులు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇళ్లలో వినియోగించుకునే కత్తులు,కొడవళ్లు తదితరాలను స్వాధీనం చేసుకోవటం, సరైన పత్రాలు లేవని మోటారుసైకిళ్లు, ఆటోలను స్వాధీనం చేసుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. రెండు రోజులుగా పట్టణంలో ఇస్లాంపేట, వైకుంఠపురం, తుఫాన్‌నగర్ తదితర ప్రాంతాల్లోని సామాన్యుల ఇళ్లలో తనిఖీలు చేయటంతో ఆ ప్రాంత ప్రజలు భయభ్రాంతులకు గురౌతున్నారు. సార్వత్రిక ఎన్నికలవేళ ఎవరి వల్ల గొడవలు జరుగుతాయి...? దాని వెనుక ఉండే వ్యక్తులు ఎవరనే విసయం పోలీసులందరికీ తెలిసినా అలాంటి వారిని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోకుండా సామాన్యుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించి వారిని భయభ్రాంతులకు చేయటమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పట్టించుకోని పాలకులు, అధికారులు

తోటపల్లిగూడూరు, మే 20 : మండలంలోని చింతోపు, సౌత్ ఆములూరు, వెంకన్నపాలెం, తదితర గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా అధికారులు, పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుధ్య పనులకు నిధులు వెచ్చించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. చింతోపులో మురుగు కాలువలో చెత్తచేరి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఒక్కో గ్రామంలో సుమారు రూ.50లక్షల వ్యయంతో కాలువలు నిర్మించారు. కానీ ఇప్పటివరకు పూడిక తీసిన దాఖలాలు లేవని, దీంతో కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందని, దీంతో వీధుల్లో వెళ్లాలంటే ముక్కులు మూసుకుని వెళ్ళాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. అంతేకాకుండా దోమలు పెరిగి వ్యాధులకు గురికావాల్సి వస్తోందని, చిల్లపేట దళిత కాలనీని ఆనుకుని ఉన్న కాలువలో నీరు ఇళ్లలోకి చేరుతున్నాయని, దుర్గంధం వెదజల్లుతోందని పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో రాబోయే వర్షాకాలంలో వర్షపు నీరు కూడా చేరి డ్రైనేజీ కాలువల నుంచి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చింతోపులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఘనంగా అలఘనాథస్వామి బ్రహ్మోత్సవాలు



హనుమంత వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

విడవలూరు, మే 20: మండల పరిధిలోని పార్లపల్లిలో అలఘనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు హనుమంత సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు అనంతరం హనుమంత వాహనంపై ఊరేగించారు. ఈ ఉత్సవాలకు ఉభయకర్తలుగా రెడ్డి సామాజికవర్గం పెద్దలు వ్యవహరించగా, భక్తులకు అన్నదానం చేశారు.

28న వేలం పాటలు

విడవలూరు, మే 20 : మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో శ్రీకామాక్షీదేవి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి రంగులు వేయుట, లైటింగ్ ఏర్పాటు, కరపత్రాలుముద్రణ, బ్రహ్మోత్సవాల్లో అన్నదానం కోసం ఈనెల 28న బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొన్న వారు రూ.300 దరావత్తును చెల్లించాల్సిన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

మనుబోలు, మే 20: ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్న అధికారులు నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండానే మనుబోలు కండలేరు కాలువ పక్కన పొర్లుకట్టను సోమవారం అక్రమార్కులు ధ్వంసం చేశారని, రెండు ఎస్కవేటర్లు పెట్టి ట్రాక్టర్ల ద్వారా వందల టన్నుల మట్టిని తరలించారని ఆరోపించారు. పొర్లుకట్టలు తొలగిస్తే వర్షం సమయంలో కట్ట లేకపోతే కాలువ నుండి వరదనీరు పొలాలపై పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వీఆర్వో నాగార్జునరెడ్డిని వివరణ కోరగా... మట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవని, విచారించి చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

యోగాతో మానసిక ప్రశాంతత



పిల్లలకు యోగా నేర్పుతున్న శిక్షకుడు

మనుబోలు, మే 20: యోగాతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని యోగా శిక్షకుడు చెలికం కోటేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం పిల్లలకు యోగాపై అవగాహన కల్పించి యోగాసనాలు వేయించారు. అనంతరం క్విజ్ పోటీలు లైబ్రేరియన్ అరుణ్ కుమార్ నిర్వహించారు.

భారీ మెజారిటీతో ప్రశాంతిరెడ్డి విజయం తథ్యం

● మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే రఫీ

విడవలూరు, మే 20: సార్వత్రిక ఎన్నికల్లో కోవూరు ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందుతారని మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే రఫీ తెలిపారు. ముదివర్తి గ్రామంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మైనారిటీ సోదరులను నిలువునా మోసంచేసిన జగన్మోహన్‌రెడ్డిని గద్దె దించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేశారన్నారు. గ్రామంలో ప్రశాంతిరెడ్డి గెలుపే లక్ష్యంగా మైనారిటీ నాయకులు, కార్యకర్తలు రాత్రింబవళ్లు శ్రమించారన్నారు. ఈ ఎన్నికల్లో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశాంతిరెడ్డి చేతిలో చిత్తుగా ఓడిపోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రశాంతిరెడ్డి ఇచ్చిన హామీలను నమ్మిన ఓటర్లు ఆమెను విజయతీరాలకు చేర్చారని ఆయన తెలిపారు. ప్రశాంతిరెడ్డి గెలుపొందిన తర్వాత మంత్రి పదవి దక్కాలని అల్లాను ప్రార్థిస్తున్నామన్నారు. జూన్ 4న జరగనున్న ఎన్నికల ఫలితాల్లో మన విజయం సాధించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణం చేస్తారని ఆయన తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్కే రఫీ

భారీ ఆధిక్యంతో సోమిరెడ్డి విజయం తథ్యం



సోమిరెడ్డిని కలిసిన జట్లకొండూరు యువకులు

మనుబోలు, మే 20: సర్వేపల్లిలో భారీ మెజారిటీతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం తథ్యం అని కొండూరు నగరం టీడీపీ యువ నాయకులు అన్నారు. పసుపులేటి దశరథ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు యువకులు సోమవారం నెల్లూరులో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు రామిరెడ్డిని అశోక్‌కుమార్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

అక్షర విద్యాలయంలో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

వెంకటాచలం, మే 20 : మండలంలోని చవటపాలెం పంచాయతీ సరస్వతి నగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్ట్‌నెంట్ కల్నల్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిక్షణ శిబిరం 24వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఎన్‌సీసీకు సంబంధించిన వివిధ విభాగాల్లో ఆర్మీ స్టాఫ్, ఎన్‌సీసీ అధికారులచే శిక్షణ ఇస్తున్నారు. ఫ్లాగ్ ఏరియా, ఫైరింగ్, మ్యాప్ రీడింగ్, జడ్జింగ్ డిస్టెన్స్, యుద్ధ నైపుణ్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నట్లు సునీల్‌కుమార్ తెలిపారు. ఎన్‌సీసీ శిబిరాన్ని ప్రత్యేక అధికారిగా మహేష్ పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, కే బాలబ్రహ్మచారి పాల్గొన్నారు.



విద్యార్థులకు ఫైరింగ్ నేర్పిస్తున్న అధికారులు

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

తోటపల్లిగూడూరు, మే 20 : మండలంలోని పేడూరు గ్రామంలో సర్వేపల్లి నియోజకవర్గ జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు నిమ్మల రమేష్‌గౌడ్, టీడీపీనాయకులు మండల ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు సంగారు వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ వేడుకలలో అస్సం నవీన్, విష్ణువర్ధన్, నిఖిల్, శరత్, సుభాష్, సంతోష్, వినయ్, ఎన్టీఆర్ ఫ్యాన్స్ అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

అధికారులే గైర్హాజరైతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి ?

● బుచ్చి మండల సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆవేదన

బుచ్చిరెడ్డిపాళెం, మే 20: సమావేశాలకు సంబంధిత అధికారులే గైర్హాజరైతే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి, ఎలా పరిష్కారమవుతాయని మండల సర్వ సభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు సభాధ్యక్షులు, అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మినగల్లు గ్రామ సర్పంచు బొర్రా పూజిత మాట్లాడుతూ మినగల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని కాలనీలో వీధులను సైతం ఆక్రమించి గదులు నిర్మించడం, పెన్నానదిలో అనుమతులు లేకుండానే వందల ఎకరాల్లో 50 అడుగుల మేర లోతు ఇసుక తవ్వకాలను అడిగితే తమపై కేసులు పెట్టారని వాపోయారు. గ్రామంలో రెండెక్కరాల మరుగుదొడ్లు, పెన్నానదిలో కలుస్తున్న మరుగుదొడ్లు, పూడిపోతున్న బావుల గురించి పట్టించుకోవడంలేదని పెనుబల్లి ఎంపీటీసీ వినయ్‌నారాయణ ఎంపీడీఓ, ఎంపీపీకి తెలిపారు. ఇస్తున్న 7గంటలు వ్యవసాయ విద్యుత్‌నైనా ఏకంగా ఇవ్వాలని కోరారు. రైతులకు సబ్సిడీ పరికరాలు, జింక్, జిప్సం, టార్పాలిన్లు, స్ప్రేయర్లు ఇవ్వాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలల్లో 25శాతం పేద విద్యార్థులకు ప్రభుత్వ జీవో ప్రకారం ఉచిత విద్య అందించాలని ఎంఈఓను కోరారు. మరమ్మతులకు గురైన చేతిపంపులు, విద్యుత్ సమస్యలపై దామరమడుగు ఒకటో ఎంపీటీసీ మనోరమ వివరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రస్తుతం ఈ సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కోడ్ తొలగించిన వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి ప్రజాప్రతినిధులకు తెలిపారు. ఈ సమావేశానికి ఆర్వీస్ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డీఓ, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు గైర్హాజరు కాగా, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సెక్రటరీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో గ్రామ సమస్యలను వివరిస్తున్న దామరమడుగు ఎంపీటీసీ సభ్యురాలు మనోరమ

భూసార పరిరక్షణపై అవగాహన సదస్సు

ఇందుకూరుపేట, మే 20 : మండలంలోని పల్లిపాడు ముదివర్తిపాళెం గ్రామాల్లో సోమవారం మండల వ్యవసాయ అధికారి డి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కలుషితం కాకుండా ప్రకృతి వ్యవసాయ దిశగా అడుగులు వేయాలని రైతులకు సూచించారు. ఈ భూసార పరిరక్షణపై అవగాహన సదస్సులు 29వ తేదీ వరకు జరుగుతాయని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సదస్సులో ఏఈఓ వాణిశ్రీ, వీహెచ్‌ఏలు శ్రీకాంత్, యమున, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పైదాపురం : స్థానిక రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి హైమావతి భూసార పరిరక్షణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీఎం ప్రణామ్ పథకం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పచ్చి రొట్ట విత్తనాలు వేయడం ద్వారా భూమిలో కర్బన శాతం పెరిగి పంటల దిగుబడులు పెరుగుతాయన్నారు. భూమిలోని సూక్ష్మ, సూక్ష్మ పోషకాలు పెంచి భూమి సారవంతం పెంచాలన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

విజయమహల్ రోడ్డులో చీకటి పనులు

● రెండు నెలలుగా వెలగని వీధిలైట్లు

● ఆందోళనలో స్థానికులు ● పట్టించుకోని అధికారులు

నెల్లూరు(వైద్యం), మే 20: నెల్లూరు నగర నడిబొడ్డులో ఉన్న విజయమహల్ గేటు సమీపంలో ఉన్న విజయమహల్ రోడ్డు చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఎక్కువగా సెక్స్ వర్కర్లు, ట్రాన్స్‌జెండర్లు ఇక్కడే చీకటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఈ ప్రాంతంలో గత రెండు నెలలుగా వీధిలైట్లు వెలగడం లేదు. కాలిపోయిన దీపాలను మార్చాలని స్థానికులు మొత్తుకుంటున్నా ఈ ప్రాంత కార్పొరేటర్‌తోపాటు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు న్నాయి. దీంతో రాత్రుల్లో నానా అగచాట్లు పడుతున్నారు. ఈ దారిలో చీకట్లు కమ్ముకుని ఆటు వైపు వెళ్లాలంటే పాదచారులు, వాహనదారులు, మహిళలు భయాందోళన చెందుతున్నారు. ఇటువైపే ఓ పాఠశాలతోపాటు నాలుగు ఆసుపత్రులు ఉన్నాయి. విద్యార్థులు, రోగులు ఉదయం పూట ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెళుతుంటారు. ఆయితే సాయంత్రం 6 గంటలు దాటితే అటు వైపు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే అదునుగా సెక్స్ వర్కర్లు తమ కార్యకలాపాలు కానిస్తున్నారు. ఈ దారిలోనే సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ కార్యాలయం కూడా ఉంది. ఆయన మంత్రిగా ఉండగా అప్పట్లో ఎప్పుడూ వీధి దీపాల వెలుగులతో కళకళలాడే ఈ ప్రాంతం ప్రస్తుతం చీకటిగా మారింది.



చీకటి పడితే ఈ ప్రాంతం అంధకారమే

ఇటు వైపు వెళ్లాలంటే...

ఈ ప్రాంతంలో వీధిదీపాలు లేవు. ఎంతో కాలంగా ఇక్కడ లైట్లు వెలగడం లేదు. దీంతో ఇటు వైపు రావాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. చీకటిపడితే ఇక్కడ గాడాంధకారమే, ఎక్కువగా ఇక్కడ ఆసుపత్రులు, పాఠశాలలు ఉండడంతో ఇటువైపు మహిళలు రావాలంటే భయపడుతున్నారు. ఈ ప్రాంతంలో లైట్లు వెయ్యమని స్థానికులు కార్పొరేషన్ అధికారులను కోరుతున్నా వారిలో చలనం మాత్రం రావడం లేదు. ఈ ప్రాంతంలో చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారింది.

- వెంకటేశ్వర్లు, స్థానికుడు



ప్రకాశం పంతులు మళ్లీ పుట్టాలి : ఉచ్చి

నెల్లూరు(సాంస్కృతికం), మే 20 : నేటి నిజాయితీ మూర్తీభవించిన ప్రకాశం పంతులు మళ్లీ పుట్టాలని, అప్పుడే నేటి రాజకీయ వ్యవస్థకు ప్రకాశం చేకూరుతుందని బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు ఉచ్చి భువనేశ్వరప్రసాద్ తెలిపారు. సోమవారం బాలాజీనగర్ గౌడ హాస్టల్ సెంటర్లో ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జనుకపల్లి కామేశ్వరప్రసాద్, శ్రీధరశర్మ, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు, తానే మస్తాన్, ఆకుల హనుమంతరావు, కేపీ చౌదరి, పసుపులేటి మల్లికార్జున, ఎస్‌కే సుభాన్‌బాషా, బీవీ లక్ష్మి, తదితరులు పాల్గొని ఆంధ్ర కేసరికి నివాళులర్పించారు.



ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

ఓట్ల లెక్కింపు ప్రతిష్ఠాత్మకం

● భారీ స్క్రీన్ల ద్వారా ఫలితాల వెల్లడి : సిటీ ఆర్వో వికాస్

నెల్లూరు(సిటీ), మే 20 : ఓట్ల లెక్కింపును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని నెల్లూరు నగర నియోజకవర్గ ఆర్వో వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ సమావేశాన్ని సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, సిబ్బంది ఎంపిక, మీడియో చిత్రీకరణ జరగాలని ఆదేశించారు. భారీ స్క్రీన్ల ద్వారా ఫలితాలు ప్రదర్శిస్తామని చెప్పారు. ప్రతి దశను కూడా కలెక్టరేట్ వద్ద భారీ భద్రతతో పాటు, నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేయాలన్నారు. చిన్నపాటి లోపం కూడా జరగకూడదన్నారు. నెట్‌ పోస్టు డిపాజిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు కౌంటింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, ఇతర సౌకర్యాల ఏర్పాట్లలో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు పాల్గొన్నారు.




అధికారులతో సమీక్షిస్తున్న సిటీ ఆర్వో వికాస్

టీడీపీ అభ్యర్థుల విజయం ఖాయం

● సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య

నెల్లూరు రూరల్, మే 20 : ప్రస్తుతం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థులందరూ మన విజయం సాధిస్తారని ఆ పార్టీ సీనియర్ నేత, కలివేలపాలెం మాజీ ఉపసర్పంచు పోలూరు సుబ్బయ్య తెలిపారు. సోమవారం అల్లీపురంలోని తన నివాసం వద్ద ఆయన మాట్లాడుతూ జిల్లాలో నెల్లూరు సిటీతో పాటు రూరల్, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల నుంచి పోటీలో ఉన్న పొంగూరు నారాయణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు భారీ మెజార్టీలతో గెలవబోతున్నారని స్పష్టం చేశారు. 2014లో టీడీపీ ఆయన చేసిన అభివృద్ధి ఉంది మెరుగ్గా ఈ సారి పథకాలు ప్రజలకు దోహదపడనున్నాయన్నారు.



పేదలకు జూ. ఎన్టీఆర్ అభిమానుల అన్నదానం

నెల్లూరు(వైద్యం), మే 20 : సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పేదలకు అన్నదానం చేశారు. జూనియర్ ఎన్టీఆర్ సేవాసమితి జిల్లా అధ్యక్షుడు సింగంశెట్టి రవితేజ ఆధ్వర్యంలో ఆత్మకూరు బస్టాండ్ పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి నేతలు అనుదీప్, కిరణ్ తేజ, వెంకి, బబ్లు, దీరజ్, నిఖిల్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సంబరాలు



జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా నెల్లూరు నర్తకి సెంటర్‌లో సోమవారం అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ అసోసియేషన్ సిటీ అధ్యక్షుడు గంగాధర్, హరీష్, శ్రీనివాసులు, రియాజ్, షావలీ, ఆశోక్, మధు తదితరులు పాల్గొన్నారు.

వీవ్ ఆఫ్ కల్చర్ షార్ట్ ఫిలింకు అవార్డుల పంట

నెల్లూరు(సాంస్కృతికం), మే 20 : సీనియర్ ఐటీ చందనా నెల్లూరు ఆదిత్య మాధూరి శ్రీనివాసరావు తనయుడు మాధూరి సంతోష్ చేసిన కుటుంబాల జీవ వైవిధ్యంపై చిత్రీకరించిన వీవ్ ఆఫ్ కల్చర్ లఘు చిత్రానికి అవార్డుల పంట పండింది. ఆయన అమెరికాలోని లాస్‌ఏంజెల్స్‌లోని న్యూయార్క్ ఫిలిం అకాడమీలో ఫిల్మింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. నిర్మాత, దర్శకుడిగా తొలి లఘు చిత్రం వీవ్ ఆఫ్ కల్చర్స్ తీశారు. ఆ షార్టుఫిలింలో ఇండియాలోని ఒక కుటుంబం, నేత చేనేత కుటుంబాలు, జీవన వైవిధ్యాలను సహజంగా చిత్రీకరించారు. ఆయన తొలి ప్రయోగం, తొలి చిత్రం అనేక ఫిలిం ఫెస్టివల్‌లో అవార్డులు సాధించింది. దాదాపు 108పైగా అవార్డులు సాధించింది రికార్డు నెలకొల్పింది. మార్చి, ఏప్రిల్ నెల్లో జరిగిన ప్రముఖ ఫిలిం ఫెస్టివల్‌లో ఈ చిత్రం ప్రదర్శన జరిగి ప్రేక్షకుల, జ్యూరీ సభ్యుల ప్రశంసలు అందుకుంది. మే 5వ తేదీన హాస్టన్‌లో వరల్డ్ ఫెస్ట్ రెమీ అవార్డు విన్నర్ లభించింది. ఏప్రిల్ 15న బోస్టన్‌లో జరిగిన వరల్డ్ ఫిలిం పేస్ట్‌లో ప్రత్యేక జ్యూరీ అవార్డు గెలుచుకుంది. మార్చి 9వ తేదీ జరిగిన ఇండియన్ వరల్డ్ ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ చిత్రం అవార్డు గెలుచుకుంది. ఏప్రిల్ 30న 14వ దాదా సాహెబ్ పాల్కే ఫిలిం ఫెస్టివల్‌లో బెస్ట్ ఫిలిం జ్యూరీ అవార్డు గెలుచుకుంది. అలాగే మరికొన్ని అవార్డులతో పాటు మాధూరి సంతోష్‌కి ఉత్తమ దర్శకుడు, నిర్మాతగా ప్రశంసల జల్లులు కురిపించారు.



ప్రత్యేక జ్యూరీ అవార్డు అందుకున్న మాధూరి సంతోష్

చంద్రప్రభపై ముక్కంటి దర్శనం

నెల్లూరు (సాంస్కృతికం), మే 20 : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట, విశాలాక్షి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథ ఆలయంలో బ్రహ్మోత్సవాలు సందర్భంగా సోమవారం రాత్రి చంద్రప్రభ అలంకారంలో స్వామి వారి ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఈవో జీ.వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఘనంగా శత చండీయాగం

నగరంలోని వేదాయపాలెం త్యాగరాజస్వామి మందిరంలో శత చండీయాగం రెండో రోజు వైభవంగా జరిగింది. మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 24 మంది రుత్వికులు చండీయాగం నిర్వహించి లఘు పూర్ణాహుతి, అర్చన, తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా కైలాసవేవ అలంకారం

నగరంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో వసంతోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం కైలాస సేవ అలంకారం వైభవంగా జరిగింది. ఈ అలంకారంలో పార్వతీపరమేశ్వరులు విహరించారు, సుబ్రహ్మణ్య స్వామి, నందీశ్వరుడు, భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో వేణుగోపాల్, సిబ్బంది పర్యవేక్షించారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు(విద్య), మే 20 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివిధ రకాల క్రీడాంశాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు సోమవారం ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుడుగుంట వేణుగోపాల్ తల్లి లక్ష్మమ్మ వర్ధంతిని పురస్కరించుకుని పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ముఖ్య అతిథిగా పాల్గొన్న కిమ్స్ ఆసుపత్రి గుండె వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా జరిగింది. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరామారావు, కార్యదర్శి సురేంద్రబాబు, కోశాధికారి అరిగెల సాయిరాం, గౌరవాధ్యక్షుడు కిరణ్ తిరువనీపేరు సభ్యులు పాల్గొన్నారు.

సెలవుల్లో పుస్తక పఠనం చేయాలి

నెల్లూరు(సాంస్కృతికం), మే 20 : విద్యార్థులు వేసవి సెలవుల్లో పుస్తక పఠనం చేయాలని ప్రజాసైన్స్ వేదిక పట్టణ అధ్యక్షుడు ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా కథలు చదవడంలో మెలకువలు నేర్పించారు. అనంతరం చదివిన కథలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ప్రసాద్‌రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పోలీస్ యాక్ట్ అమలు

● డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైం), మే 20: నెల్లూరు నగర సబ్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ యాక్ట్ అమల్లో ఉంచామని పేర్కొన్నారు. ఈ యాక్ట్ ప్రకారం ప్రజలు, రాజకీయపార్టీలు, ఇతర సంఘాలు ముందస్తు అనుమతి లేనిదే ఎటువంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని, నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయుడికి ఆర్థిక సాయం

నెల్లూరు(విద్య), మే 20 : నగరంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తాళ్ల ఆరోగ్యదర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై రాయవేలూరులోని సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన చికిత్స కోసం ఏపీ ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నేతలు సోమవారం బాధితుడి కుటుంబ సభ్యులకు రూ.30వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కే.విశ్వమోహన్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందచేస్తున్న అసోసియేషన్ సభ్యులు

గంగజాతరకు తిరుపతి సిద్ధం



తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి) : వారం రోజులుగా జరుగుతున్న తిరుపతి గంగ జాతర వేడుకలు ప్రధాన ఘట్టానికి చేరుకున్నాయి.బయటి ప్రాంతాల్లో వుంటున్న తిరుపతివాసులంతా మంగళవారం నాటి జాతరలో పాల్గొని గంగమ్మను దర్శించుకునేందుకు నగరానికి చేరుకున్నారు.దాదాపు లక్షమంది భక్తులు తాతయ్యగుంట గంగమ్మను దర్శించుకుంటారని అంచనా వేసిన అధికారులు అందుకు తగ్గ ఏర్పాట్లు చేపట్టారు. జాతర చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ (సీఎఫ్వో)గా గతంలో ఇక్కడ ఈవోగా పనిచేసి, ప్రస్తుతం నంద్యాల జిల్లాలోని సుబ్రమణ్యా స్వామి ఆలయానికి ఈవోగా పనిచేస్తున్న రామకృష్ణను దేవాదాయ శాఖ నియమించింది. సోమవారం ఆయన ఆలయానికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. మంగళవారం జరగబోయే ప్రధాన పండుగను అందరి సహకారంతో జయప్రదంగా నిర్వహిస్తామని చెప్పారు. కాగా జాతర చాటింపు నుంచీ విభిన్న రీతుల వేషధారణలతో అలసిన గంగమ్మను శాంతింపజేసేందుకు సోమవారం అర్ధరాత్రి తర్వాత అర్చకులు మహాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణతో వజ్రకిరీటాన్ని ధరింపచేశారు.అమ్మవారి అభిషేక దర్శనం కోసం వేలాదిమంది భక్తులు బారులు తీరారు.



ధ్వజారోహణం



శేష వాహన సేవ

శేషుడిపై నృసింహుడి విహారం

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం

డక్కిలి, మే 20 : పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా జరిగింది. గరుత్మంతుడి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో తిరుచ్చి క్షేత్రోత్సవం నిర్వహించారు. తెల్లటి గుడ్డపై పసుపు, గంధం, కుంకుమతో ప్రత్యేకంగా తయారు చేసిన గరుత్మంతుడి ప్రతిమను ధ్వజస్తంభంపై ఎగురవేసి సకల దేవతలకూ ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కొడి ముద్ద ప్రసాదం కోసం మహిళలు పోటీపడ్డారు. తిరుచ్చి ఉత్సవం, సహస్ర దీపాలంకారసేవ, ఊంజల్ సేవ కార్యక్రమాలు నిర్వహించాక ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి తిరుచ్చిపై కొలువు దీర్చి ఆలయంలో గిరి ప్రదక్షిణలు చేశారు. అలంకార మండపంలో ప్రత్యేక స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పెంచల లక్ష్మీనృసింహుడు ఉభయ దేవేరులతో కలిసి శేషవాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వగా కోన వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం 6 గంటలకు పూలంగిసేవ, 8 గంటలకు హంసవాహన సేవ, రాత్రి 10 గంటలకు బంగారు హనుమంత సేవ కార్యక్రమాలను శాస్త్రోకంగా నిర్వహిస్తారు.

సిట్ దర్యాప్తులో వెలుగులోకి కీలక విషయాలు

చంద్రగిరి పోలీసుల వైఖరిపై సిట్ నివేదిక

తిరుపతి(నేరవిభాగం), మే 20 : తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన హింసాత్మక ఘటనలకు పోలీసుల వైఫల్యమే ప్రధాన కారణంగా సిట్ అధికారులు గుర్తించారు. అలాగే సిట్ దర్యాప్తులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా పద్మావతి వర్శిటీ వద్ద నానీపై వైసీపీ శ్రేణులు మారణాయుధాలతో హత్యాయత్నానికి ప్రయత్నించినా సీరియస్‌గా పరిగణించకుండా కేవలం హత్యాయత్నం జరిగిందని 307 సెక్షన్ కింద కేసు నమోదు చేయడం సిట్ గుర్తించింది.సీఐ రామచంద్రరెడ్డి వాహనాన్ని ధ్వంసం చేసిన కేసులో 21మందిని నిందితులుగా గుర్తించి 41ఏ కింద నోటీసులు జారీ చేశారు.కూచువారిపల్లిలో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన దాడులు, ప్రతి దాడులకు సంబంధించి రామిరెడ్డిపల్లి సర్పంచ్ కొటాల చంద్రశేఖర రెడ్డి, మోహిత్ రెడ్డి గన్‌మ్యాన్ ఈశ్వరరెడ్డి, పీఆర్వో బండి వేణుగోపాల రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మూడు కేసుల్లో దాదాపు 64మందిని నిందితులుగా గుర్తించారు. వీరిపై నమోదైన ఎఫ్ఐఆర్‌లలో వుంచిన సెక్షన్లు సీరియస్‌గా వున్నా భారీసంఖ్యలో వైసీపీ శ్రేణులు విచక్షణారహితంగా కర్రలు, రాడ్లు, రాళ్ళతో టీడీపీ నాయకులు, గ్రామస్తులపై దాడి చేసి గాయపరచిన ఘటనకు సంబంధించి మాత్రం కేవలం ముగ్గురు నిందుతులను మాత్రమే నమోదు చేయడం పోలీసుల పక్షపాతానికి నిదర్శనమన్న విమర్శలున్నాయి. ఈ నాలుగు కేసుల్లో ఇప్పటివరకూ చంద్రగిరి పోలీసులు ఏ ఒక్క నిందితుడినీ అరెస్టు చేయకపోవడాన్ని సిట్ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. దీనిపై సోమవారం చంద్రగిరి డీఎస్పీపై జిల్లాస్థాయి ఉన్నతాధికారి అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే బ్రాహ్మణకాలువలో పోలింగ్ రోజు వైసీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య జరిగిన గొడవల్లో దాదాపు 10 మంది గాయపడినట్లు సమాచారం. ఇరువర్గాలను చెదరగొట్టడానికి సీఆర్పీఎఫ్ సిబ్బంది నాలుగు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అయితే ఇక్కడ కూడా నిందితులను అరెస్టు చేయలేదని సిట్ సభ్యులు డీఎస్పీ రవిమనోహరాచారి, సీఐ ప్రభాకర్ గుర్తించడంతో పాటు ఎఫ్ఐఆర్‌లలో కొత్త సెక్షన్లు చేర్చే విషయమై ఉన్నతాధికారులకు సిపార్సు చేశారు.కూచువారిపల్లి, రామిరెడ్డిపల్లి, బ్రాహ్మణకాలువ గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించినా అవసరమైనన్ని బలగాలను నియమించడంలోనూ,ఘటనలను నివారించడంలోనూ పోలీసుల వైఫల్యాన్ని సిట్ నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది.ఈ నేపథ్యంలో కొంతమంది అధికారులపై వేటు పడే అవకాశం వుందని తెలిసింది.



రామిరెడ్డిపల్లెలో ఆదివారం సిట్ అధికారుల విచారణ

పోలీసు వైఫల్యమే!

ఎన్నికల కేసుల్లో నిందితుల అరెస్టుకు డీజీపీ ఆదేశం

జిల్లాలో సుమారు వంద మందిపై నమోదైన కేసులు

నానీపై దాడి కేసులో 13 మంది మాత్రమే అరెస్టు

మిగిలిన కేసుల్లో నిందితుల అరెస్టుకు ఐదు బృందాల ఏర్పాటు

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలకు సంబంధించిన కేసుల్లో నిందితులను తక్షణం అరెస్టు చేయాలని డీజీపీ హరీష్ గుప్తా ఆదేశించారు. ఈనెల 13న పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన ఘర్షణలకు సంబంధించి నమోదైన కేసుల్లో ఇప్పటి వరకూ 13మందిని మాత్రమే అరెస్టు చేశారు. మిగిలిన కేసుల్లో నిందితులను అరెస్టు చేయలేదని సిట్ అధికారులు తమ నివేదికలో ప్రస్తావించారు. దీంతో ఇప్పటివరకూ అరెస్టు కాని నిందితులను 24 గంటల్లో అరెస్టు చేయాలని డీజీపీ జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఆ మేరకు జిల్లా ఎస్పీ నిందితుల అరెస్టు కోసం ప్రత్యేకంగా ఐదు బృందాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు జరిగిన పలు ఘర్షణలకు సంబంధించి జిల్లాలో వంద కంటే ఎక్కువ మందిపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాలవ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘర్షణపై పోలింగ్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. అలాగే అదే రోజు రాత్రి చంద్రగిరి మండలం కూచివారిపల్లిలో జరిగిన ఘర్షణలకు సంబంధించి సర్పంచ్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదుతో 24 మందిపై కేసు నమోదైంది. ఆ ఘర్షణలకు సంబంధించే వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గన్‌మ్యాన్ ఈశ్వర్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో 20 మందిపై కేసు నమోదైంది. ఇదే 20 మందిపై మోహిత్ రెడ్డి పీఆర్వో బండి వేణుగోపాల్‌రెడ్డి చేసిన ఫిర్యాదుపైనా పోలీసులు కేసు నమోదు చేశారు.కూచువారిపల్లి మాజీ సర్పంచ్ కవిత, గ్రామస్తురాలు వనజ చేసిన ఫిర్యాదులతో ముగ్గురు వ్యక్తులను పేర్కొంటూ మరికొందరిపై అంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసులోనూ నిందితుల సంఖ్య 20 మంది దాకా వుండే అవకాశముంది. 14వ తేదీ తిరుపతిలో టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరగగా ఆ కేసులోనూ పలువురిపై కేసు నమోదైంది. అక్కడే పోలీసు వాహనం వజ్రపై, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి వాహనంపై జరిగిన దాడులకు సంబంధించి పదిమందిపై కేసు నమోదైంది. ఎమ్మార్‌పల్లి సీఐపై దాడి కేసులో ఎనిమిదిమందిని నిందితులుగా గుర్తించారు. ఇలా మొత్తం ఎనిమిది కేసుల్లో వంద మందికి పైనే నిందితులుగా కేసుల్లో నమోదయ్యారు. ఇందులో ఇప్పటి వరకూ కేవలం నానీపై హత్యాయత్నం కేసులో 13 మందిని మాత్రమే పోలీసులు అరెస్టు చేశారు. మిగిలిన ఏడు కేసుల్లో ఒక్కరినీ అరెస్టు చూపలేదు. ఆదివారం ఈ కేసులపై దృష్టి సారించిన సిట్ అధికారులు అరెస్టులు జరగని విషయాన్ని తమ నివేదికలో ప్రస్తావించారు. దీంతో అప్రమత్తమైన డీజీపీ 24 గంటల్లో మిగిలిన కేసుల్లో నిందితులను అరెస్టు చేయాలని తిరుపతి ఎస్పీని ఆదేశించారు.దీంతో నిందితుల అరెస్టు కోసం ఐదు ప్రత్యేక బృందాలను ఎస్పీ రంగంలోకి దించారు. కాగా పులివర్తి నానీపై హత్యాయత్నం సందర్భంగా ఆయన గన్‌మ్యాన్ ధరణి జరిపిన కాల్పుల్లో గాయపడి చెన్నైలో చికిత్స తీసుకున్న నిందితుడొకరు డిశ్చార్జి అయినట్టు తెలిసింది. అతడిని అరెస్టు చేయడానికి అధికారులు చెన్నై వెళ్ళినట్టు సమాచారం. మరోవైపు ఎన్నికల ఘర్షణలకు సంబంధించిన నమోదైన కేసుల్లో అదనపు సెక్షన్లను చేర్చాల్సిన అవసరముందని సిట్ అధికారులు తమ నివేదికలో సిఫారసు చేసినట్టు తెలిసింది.

ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా లక్ష్మీనరసయ్య



తిరుపతి(ఆటోనగర్),మే 20 : ఎస్పీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్‌గా వై.లక్ష్మీనరసయ్యను నియమితులయ్యారు. సదరన్ డిస్కంలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా వున్న వి.ఎన్. బాబు పదవీ కాలం ముగియడంతో ఫైనాన్స్ విభాగంలో సీజీఎంగా పని చేస్తున్న వై.లక్ష్మీనరసయ్యను అదే విభాగానికి పూర్తి బాధ్యతలతో డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన సీజీఎం బాధ్యతలతో పాటు అదనంగా డైరెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తారు.ప్రభుత్వం ఫైనాన్స్ డైరెక్టర్‌గా మరో వ్యక్తిని నియమించేవరకు ఈయన ఆ పదవిలో కొనసాగుతారు.

తిరుపతి- కాట్పాడి మధ్య నాలుగు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), మే 20: తిరుపతి-కాట్పాడి స్టేషన్ల మధ్య రోజువారీగా నడుస్తున్న స్పెషల్ ప్యాసింజర్ రైళ్లను ఈ నెల 27 నుంచి 30వ తేది వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.కోయంబత్తూరు-తిరుపతి,విల్లుపురం-తిరుపతి,బెంగళూరు-తిరుపతి మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్‌లకు కూడా ఈ తేదీల్లో కాట్పాడి-తిరుపతిల మధ్య రాకపోకలు రద్దు చేసినట్లు తెలిపారు.తిరుపతిలో రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా రైళ్లను తాత్కాలికంగారద్దు చేస్తున్నామని, ప్రయాణికులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కౌంటింగుకు పకడ్బందీ ఏర్పాట్లు

● తిరుపతి అసెంబ్లీకి మాత్రం స్థలాభావం దృష్ట్యా గుర్తింపున్న పార్టీల ఏజెంట్లకే అనుమతి : కలెక్టర్
60 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం ● బెట్టింగ్ రాయుళ్లపై చర్యలు : ఎస్పీ



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి(కలెక్టరేట్), మే 20: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటుకు వేర్వేరుగా కౌటింగ్ హాల్స్ ఏర్పాటు చేశామన్నారు.జూన్ 4న సీసీ కెమెరాల నిఘాలో ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థుల తరపు ఏజెంట్ల సమక్షంలో ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. తిరుపతి అసెంబ్లీకి 46మంది అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో అంతమంది ఓట్ల లెక్కింపు గదిలో కూర్చునే స్థలం లేనందున ఈసీ గుర్తింపు పొందిన పార్టీల ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, మిగిలినవారికి పక్కనే గదిలో కూర్చునేదానికి ఏర్పాటు చేశామని.. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఓట్ల లెక్కింపును పరిశీలించుకోవచ్చన్నారు.ఏఎస్‌డీ జాబితా ద్వారా బోగస్ ఓట్లను అరికట్టడంతో తిరుపతిలో ఓటింగ్‌శాతం తగ్గిందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కిస్తామన్నారు.ఎన్నికల్లో జరిగిన ఘర్షణలకు సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు.కౌంటింగ్ ముగిశాక కూడా 15రోజులు కేంద్రబలగాలు ఇక్కడే వుండి శాంతిభద్రతలను పర్యవేక్షిస్తాయన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు జరిగిన తరువాత చోటు చేసుకున్న ఘర్షణలపై ఐదు కేసులు నమోదు చేసి 54మందిని అరెస్టు చేశామన్నారు. ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో 60 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించామని, కౌంటింగు నాడు అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తమన్నారు.ఫలితాలపై పందేలు కాస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల్లో ఎల్లుండినుంచి గజ గణన

మంగళం, మే 20 : ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఏనుగుల గణనకు ముహూర్తం నిర్ణయించారు.ఈ నెల 23, 24, 25 తేదీల్లో ఈ మూడు రాష్ట్రాల్లో మూడు రోజుల పాటు గజ గణన చేపట్టనున్నారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు కుప్పం దగ్గర కలిసి ఉండడంతో మూడు రాష్ట్రాల గజ గణన ఒకేసారి చేపడితే ఖచ్చితమైన సంఖ్య వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఏనుగులు దాడి చేసి పంట నష్టం, ప్రాణనష్టం కలిగిస్తున్నాయి. గజ గణన చేపడితే ఏ ప్రాంతంలో ఎక్కువ ఏనుగులు ఉన్నాయో తెలుసుకుని వాటికి ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించగలిగితే ఊర్లమీదకు వచ్చే అవకాశం వుండదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. మొదటిరోజు జిగ్జాగ్ పద్ధతిలో అన్ని బీట్లను జల్లెడ పడతారు. రెండవ రోజు ట్రాన్సక్ట్ లైన్స్‌లో ఏనుగులను గుర్తించడం జరుగుతుంది. మూడవ రోజు అటవీప్రాంతంలో మంచినీటి కుంటలు, చెరువులు ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేస్తారు.

తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారి

ఎస్‌బీ డీఎస్పీగా వెంకటాద్రి నియామకం



తిరుపతి(నేరవిభాగం), మే 20 : తిరుపతి డీఎస్పీగా ఏసీబీ డీఎస్పీ రవిమనోహరాచారి నియమితులయ్యారు. పోలింగు సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలపై సీరియస్ అయిన ఈసీ ఇద్దరు డీఎస్పీలను, ఇద్దరు సీఐలను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.వీరి స్థానంలో తిరుపతి నగర డీఎస్పీగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనిచేసిన అనుభవం,శాంతి భద్రతలపై పట్టున్న అధికారిగా పేరున్న డీఎస్పీ రవిమనోహరాచారిని నియమించింది.తిరుపతి ఈస్ట్ సీఐగా, తిరుమలలో విజిలెన్సు విభాగంలో, మదనపల్లె డీఎస్పీగా, చిత్తూరులో సీఐగా పనిచేసిన రవిమనోహరాచారి ప్రస్తుతం తిరుపతి ఏసీబీ డీఎస్పీగా వున్నారు.ఎన్నికల హింసాత్మక ఘటనలపై విచారణ జరపడానికి ఎన్నికల కమిషన్ నియమించిన సిట్ బృందంలో సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ శాంతియుతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారిని నియమించారు. అలాగే తిరుపతి ఎస్బీ డీఎస్పీగా ఎం. వెంకటాద్రి, అలిపిరి సీఐగా రామారావును నియమించారు. ఈయన గతంలో అనంతపురంలో విజిలెన్సు సీఐగా పనిచేసి వీఆర్‌కు బదిలీ అయ్యారు. అక్కడినుంచి ప్రస్తుతం అలిపిరి సీఐగా నియమితులయ్యారు. వీరితో పాటు తిరుపతి, చిత్తూరులో పలు ప్రాంతాల్లో ఎస్‌గా పనిచేసిన విశ్వనాథ చౌదరిని ఎస్బీ సీఐగా నియమించారు.తిరుపతిలో ఎస్బీ ఎస్ఐగా కూడా పనిచేసిన ఈయన ప్రస్తుతం అనంతపురంలో వీఆర్‌లో వుంటూ తిరుపతికి వస్తున్నారు. వీరందరూ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

తలకాయ తీసేస్తా..!

● అడ్డదారి దర్శనాలను అడ్డుకున్న హోంగార్డుపై రెచ్చిపోయిన ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగి

శ్రీకాళహస్తి, మే 20: ముక్కంటి ఆలయంలో అడ్డదారి దర్శనాలను హోంగార్డు అడ్డుకోవడంపై ఒక ఒప్పంద ఉద్యోగి రెచ్చిపోయాడు. 'నన్నే ఆపుతావా.. నీ తలకాయ తీసేస్తా... బయటకు రా నీ అంతు చూస్తా... కత్తితో పొడిచేస్తా.ఏమనుకుంటున్నావు ' అంటూ హడలెత్తించాడు. దీంతో వణికిపోయిన హోంగార్డు వైర్‌లెస్ సెట్‌లోనే అధికారులకు బెదిరించడంపై తన ఆవేదనను వ్యక్తం చేశాడు. దీంతో ఆలయం నలుమూలల్లో హోంగార్డుపై బెదిరింపు మాటలు సోమవారం మార్మోగాయి.శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఓ యువకుడు వైసీపీ నేతలతో సన్నిహితంగా ఉంటాడు. రెండేళ్ల క్రితం అధికార పార్టీ సిఫార్సుతో పీఆర్వో కార్యాలయంలో ఉచిత సేవకుడిగా చేరాడు. అక్కడినుంచి అధికారులతో సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తూ అడ్డదారి దర్శనాలు చేయిస్తూ ఆర్థికంగా బలపడ్డాడు.ఓ అధికారి అండతో మూడు నెలల క్రితం దేవదాయశాఖ ఉన్నతాధికారుల నుంచి ఒప్పంద ఉద్యోగిగా నియామకం పొందాడు.అయితే తమకు సంబంధం లేకుండా ఓ అధికారి సాయంతో ఒప్పంద ఉద్యోగి కావడంపై అధికార పార్టీ నేతల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఈ యువకుడికి సహకరించిన అధికారిని నిలదీశారు.ఆ తరువాత ఏం జరిగిందో కానీ అధికారులు, వైసీపీ నాయకుల మధ్య సయోధ్య కుదిరింది. ఈ యువకుడి తరహాలోనే మరో ఏడుగురు ఒప్పంద ఉద్యోగులుగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు.ఒప్పంద ఉద్యోగిగా మొదట చేరిన యువకుడు అడ్డదారిలో దర్శనాలు చేయించేందుకు యదేచ్ఛగా ఆలయంలోకి చొరబడేవాడు.అంతేకాకుండా ఆలయ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి.సోమవారం ఆలయంలో పెద్దఎత్తున రద్దీ నెలకొనడంతో క్యూలైన్లు స్తంభించిపోకుండా భద్రతా సిబ్బందికి అధికారులు పలు ఆంక్షలు సూచించారు.అద్దాల మండపం వద్ద భక్తులు వెలుపలకు వచ్చే గేటు దగ్గర రాజేష్ అనే హోంగార్డుకు విధులు కేటాయించారు. భక్తులు వెలుపలకు వచ్చే క్యూలైన్‌లో ఎవరూ ఎదురు వెళ్లకుండా హోంగార్డు అడ్డుకట్ట వేశాడు. అయితే ఒప్పంద ఉద్యోగి ఓ భక్తుల బృందాన్ని తీసుకుని వ్యతిరేక దిశలో వెళ్లేందుకు అద్దాల మండపం వద్దకు చేరుకున్నాడు. అక్కడ హోంగార్డు రాజేష్ అడ్డదారిలో ప్రవేశించేందుకు అనుమతించలేదు. దీంతో ఆగ్రహానికి గురైన ఒప్పంద ఉద్యోగి వాగ్వాదానికి దిగాడు. ఉన్నతాధికారుల అనుమతి తీసుకువస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ హోంగార్డు తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు.ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.ఫోన్‌లో అధికారులకు జరిగిన వాగ్వాదంపై ఫిర్యాదు చేశారు. అయితే ఎవరూ అడ్డదారి దర్శనానికి అనుమతి ఇవ్వకపోవడంతో హోంగార్డు గేట్ తెరవలేదు. దీంతో ఒప్పంద ఉద్యోగి భక్తులందరూ చూస్తుండగానే కత్తితో పొడిచేస్తా... తల తీసేస్తానంటూ ఊగిపోయాడు. ఇంతలో హోంగార్డు భయాందోళనకు గురై ఒప్పంద ఉద్యోగి తనను దూషించిన విషయాన్ని వైర్‌లెస్‌సెట్ ద్వారా అధికారులకు తెలిపాడు. ఆలయ పరిసరాల్లోని అన్ని విభాగాల్లో పనిచేసే అధికారుల వద్ద వైర్‌లెస్ సెట్లు ఉంటాయి. దాంతో ఒప్పంద ఉద్యోగి నిర్వాకం అన్ని వైర్‌లెస్‌సెట్లలో మార్మోగింది.ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇంతటి భయంకరమైన పదజాలంతో బెదిరించడంపై అధికారులు, ఉద్యోగులు, ఆలయ సిబ్బంది హతాశులయ్యారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆర్చరీ ఆసియా కప్ పోటీలకు గణేష్ మునిరత్నం ఎంపిక



నాయుడుపేట, మే 20: దక్షిణ కొరియాలోని సువాన్ కేంద్రంలో జూన్ 2 నుంచి 9వ తేదీ వరకు జరిగే 2024 ఆర్చరీ ఆసియా కప్ పోటీలకు నాయుడుపేట పట్టణానికి చెందిన తిరుమూరు గణేష్ మునిరత్నం ఎంపికయ్యాడు. బాల్యం నుంచి ఆర్చరీ పట్ల ఆసక్తి చూపుతున్న యువ క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో జరిగిన పలు క్రీడా పోటీల్లో పాల్గొని బంగారు, రజత పతకాలు సాధించాడు. గణేష్ మునిరత్నం ఆసియా కప్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఏపీ ఆర్చరీ సంఘ కార్యదర్శి సత్యనారాయణ, కమల కిషోర్ తదితరులు అభినందనలు తెలిపారు.

కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

నాయుడుపేట టౌన్, మే 20 : పట్టణానికి సమీపంలోని తుమ్మూరులో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరి మాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలు అంకు ర్పాణతో ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 20నుంచి 30వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు సోమవారం బ్రహ్మోత్సవాల ప్రారంభానికి వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అంకురార్పణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్, మే 20: పట్టణంలోని బాలాజీ గ్రీన్‌సిటీ, బీఎంఆర్ నగర్, లోతువానిగుంట, పాత బీడీకాలనీ, కొత్తబీడీకాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. ఫీడర్ లైన్ల మరమ్మతులు చేపడుతున్న కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

వైద్యుడి నిర్లక్ష్యంతో శిశువు మృతి
బాధితుల ఆందోళనతో డాక్టర్ పరార్



వాకాడు, మే 20: సుఖప్రసవం చేస్తానని చెప్పిన వైద్యుడు మృత శిశువును చేతిలో పెట్టడంతో బాధితులు ఆందోళనకు దిగారు. వారి కథనం మేరకు... నిడిగుర్తి పంచాయతీ నలగాముల గ్రామానికి చెం దిన ముంగర చెంచురెడ్డి భార్య వాసంతికి పురిటి నొప్పులు రావడంతో శనివారం మధ్యాహ్నం నిడిగుర్తి వైద్యశాలకు వెళ్లి డాక్టర్ రామకృష్ణను కలిశారు. డాక్టర్ పరిశీలించి తమ ఆస్పత్రిలోనే సుఖప్రసవం చేస్తానని చెప్పడంతో ఒప్పుకున్నారు.అరగంటలో అయిపోతుందని చెప్పిన డాక్టర్ తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతి చెందిన మగ శిశువును అప్పజెప్పడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మీ నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ సోమవారం ఉదయం వైద్యశాల వద్ద ఆందోళన చేపట్టడంతో డాక్టర్ అక్కడినుంచి జారుకున్నారు.

తాటిముంజలకు పెరిగిన డిమాండ్



గూడూరు, మే 20: వేసవిలో మాత్రమే దొరికే తాటిముంజలకు డిమాండ్ పెరిగింది. గూడూరు చుట్టుపక్కల ఉన్న చిల్లకూరు, సైదాపురం, తూర్పు పూండ్ల, బద్దె వోలు తదితర గ్రామాల నుంచి తాటిమంజ లను తీసుకువచ్చి పట్టణంలోని పలు కూడళ్లల్లో విక్రయిస్తున్నారు.వేసవి తాపం తీరేందుకు తాటిముంజలను తినేందుకు ఇష్టపడుతున్నారు. కొంతమంది తాటికాయలను తీసుకువచ్చి వినియోగదారుల ముందే కొట్టి ముంజలను వేరు చేసి ఇస్తున్నారు. డజను రూ.50కు విక్రయిస్తున్నారు. మరికొంతమంది తాటికాయల నుంచి వేరు చేసిన ముంజలను డజను రూ.40కు విక్రయిస్తున్నారు. గతేడాది నాలుగు ముంజలు రూ.10 పలికాయి.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, మే 20: పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో సోమవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. తమ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు ప్రతినెలా నిత్యావసరాలను అందిస్తున్నట్టు క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఎన్.నాగులు, బి.శ్రీనివాసులు, సుబ్రమణ్యం, ఎస్ఎల్ఎన్‌బాబు, టి.శ్రీనివాసులు, గిరిబాబు, ధనుంజయరెడ్డి, నాగరాజారెడ్డి, సుమ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో
ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గూడూరు అర్బన్, మే 20: మండలంలోని చెన్నూరులో ఉన్న గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ మధుసూదన్‌బాబు సోమవారం తెలిపారు. 3వ తరగతిలో 32 సీట్లు, 4వ తరగతిలో 35, 5వ తరగతిలో 23, 6వ తరగతిలో 27, 7వ తరగతిలో 11, 8వ తరగతిలో 7, 9వ తరగతిలో 16 సీట్లున్నాయని తెలిపారు. వివరాలకు నెం. 9441736136, 6300613644, 9885944982, 9603624251లలో సంప్రదించవచ్చు.

ప్రభుత్వ స్థల కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

పెళ్లకూరు, మే 20: మండలంలోని అనకవోలు పంచాయతీ పెరుమాళ్లపల్లిలో మనోహర్ నాయుడు అనే వ్యక్తి ప్రభుత్వ భవనంతో పాటు కొంత స్థలాన్ని ఆక్రమిం చుకున్నారని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పశువైద్యశాల భవనంతో పాటు కొంత స్థలాన్ని ఆక్రమించుకుని పిల్లర్లు వేసి ఇంటిని నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆక్రమణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రసాదరావును వివరణ కోరగా వీఆర్వోను విచారణకు పంపామన్నారు. నిర్మాణ పనులను అడ్డుకున్నామని చెప్పారు. అలాగే తాళ్వాయిపాడు రెవెన్యూ పరిధిలోని స్వర్ణముఖి నది తీరాన సీలింగ్‌కు భూముల్లో ఏర్పాటు చేసిన అక్రమ ప్రహరీని తొలిగించాలని ఆర్ఐ సంతోషిబాయిను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్వీ ప్రసాద్‌రావు, ఎం.గురునాథం, పవన్‌కల్యాణ్, వెంకటకృష్ణయ్య, నాగరాజు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహవాసులను వీడని సమస్యలు



గృహాల మధ్య పెరిగిన చెట్లు - చెదలు పట్టడంతో దెబ్బతిన్న ద్వారబంధనం - ట్యాంకర్ల ద్వారా నీటిని పట్టుకుంటున్న స్థానికులు

గూడూరు, మే 20: పేదల సొంతింటి కల నేరవేర్చాలనే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గూడూరు పట్టణంలోని గాంధీనగర్‌లో టిడ్కో గృహాలను నిర్మించింది. తీరా పంపిణీ సమయానికి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాయిదా పడింది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల కొంతమందికి గృహాలు పంపిణీ చేశారు. అయితే వసతులు కల్పించకపోవడంతో సమస్యలతోనే కాపురం చేయాల్సి వస్తోందని లబ్ధిదారులు వాపోతున్నారు.

టీడీపీ ప్రభుత్వ హయాంలో గాంధీనగర్ ప్రాంతంలో 5,120 టిడ్కో గృహాలను నిర్మించారు. ఇందులో 2,800 మంది లబ్ధిదారులకు ఇటీవల గృహాలను అందజేశారు. ఆ ఇళ్లలో కూలీలు, వీధి వ్యాపారులు ఉన్నారు. వీరు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. వారానికి ఒక్క రోజు మాత్రమే పైప్‌లైన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతుందని, అది కూడా అవసరాలకు సరి పోవడం లేదంటున్నారు. మున్సిపల్ అధికారులు ట్యాంకర్లను పంపితే ఆ నీటిని పట్టుకుని అవసరాలు తీర్చుకుంటున్నామని చెబుతున్నారు. నీటి కోసం ఇబ్బంది పడలేక సుమారు 1000 కుటుంబాలు ఖాళీ చేసినట్టు చెబుతున్నారు. మూసి వేసిన ఇళ్ల ద్వారబంధనాలకు చెదలు పట్టాయి. ఇక గృహ సముదాయ పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. విషసర్పాల సంచారం అధికంగా ఉంటోంది. ఈ సమస్యలపై పలుమార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించలేదంటున్నారు. వైసీపీ ప్రభుత్వం తమ గృహాలకు రంగులను మార్చిందేకానీ వసతుల కల్పను చర్యలు తీసుకోలేదన్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

తడ రైల్వేస్టేషన్ నుంచి కొబెల్కో క్రేన్ల రవాణా
శ్రీసిటీ పరిశ్రమల ఉత్పత్తుల రవాణాకు ఊతం ● తడ నుంచి ప్రత్యేక రైలు రవాణా సదుపాయం



తడ రైల్వేస్టేషన్ నుంచి రవాణా అవుతున్న ఎక్స్‌కవేటర్లు

తడ, మే 20: శ్రీసిటీలోని ఎక్స్‌కవేటర్ల తయారీ సంస్థ కొబెల్కో తమ ఉత్పత్తులైన ఎక్స్‌కవేటర్లు, క్రేన్లను తడ రైల్వే స్టేషన్ నుంచి సోమవారం రాజస్థాన్‌లోని జైపూర్‌కు రవాణా చేసింది. ఇది తడ రైల్వేస్టేషన్ నుంచి శ్రీసిటీలోని పారిశ్రామిక ఉత్పత్తులకు సంబంధించి మొట్ట మొదటి ప్రత్యక్ష రైలు రవాణా కావడం విశేషం. మొట్టమొదట సారి 35 ఎక్స్‌కవేటర్లను కొబెల్కో సంస్థ తరలించింది. ఉత్తర భారతదేశానికి రైలు రవాణ దిశగా పెరుగుతున్న డిమాండు దృష్ట్యా తమ భారీ వాహనాల రవాణాకు ఈ సదుపాయాన్ని ఎంచుకున్నట్లు కొబెల్కో ప్రతినిధి తెలిపారు. దీంతో పాటు ఈ రైలు రవాణా ద్వారా 20శాతం వరకు ఖర్చు ఆదా అవుతుందన్నారు. ట్రక్కుల ద్వారా చేసే రోడ్డు రవాణాతో పోలిస్తే ఈ పద్ధతిలో కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడుతుందని చెప్పారు. తడ రైలు రవాణా సేవలపై శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ రవాణా కోసం తడ రైల్వేస్టేషన్‌లో మెరుగైన కార్గో హ్యాండ్లింగ్ సౌకర్యాలు, కంటైనర్ జోన్, తదితర సౌకర్యాలు కల్పించే దిశగా రైల్వేశాఖ చొరవ చూపాలని కోరారు. శ్రీసిటీతో పాటు పరిసర ప్రాంతాల పరిశ్రమలకు ఇది అత్యంత ప్రయోజనకరమైన సదుపాయంగా ఆయన వ్యాఖ్యానించారు. తడ రైల్వే స్టేషన్ నుంచి రవాణా సదుపాయం పట్ల శ్రీసిటీ పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు
బాలిక మృతి, ఐదుగురికి గాయాలు



మృతి చెందిన అయిషా సమీన

నారాయణవనం, మే 20: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఓ బాలిక మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన నారాయణవనం మండల పరిధిలోని గోవిందప్పనాయుడు కండ్రిగ వద్ద సోమవారం రాత్రి జరిగింది. రేణిగుంట బుగ్గవీధికి చెందిన రజాక్ అహ్మద్ కుటుంబ సభ్యులతో కలిసి నాగలాపురం మండలం టీపీ కోట వద్ద ఓ శుభకార్యానికి వెళ్లారు. సోమవారం రాత్రి కారులో రేణిగుంటకు వెళ్తుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న మరో కారు గోవిందప్పనాయుడు కండ్రిగ వద్ద వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రజాక్ అహ్మద్(35), అతని భార్య యాస్మిన్(29), కుమార్తె అయిషా సమీన(10), కుమారులు షాధిక్ అహ్మద్(8), రెహ్మాన్ అహ్మద్(1), కారు డ్రైవర్ బషీర్(58) గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా ఆయిషా సమీనా(10) మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జయరాం నాయక్ తెలిపారు.

గొర్రెల మందను ఢీకొన్న ప్రైవేటు అంబులెన్స్
కాపరికి గాయాలు ● 11 గొర్రెల మృతి

గూడూరు, మే 20: మండల పరిధిలోని తిరుపతిగారిపల్లిలో సోమవారం రాత్రి గొర్రెల మందను ఓ ప్రైవేటు అంబులెన్స్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడగా, 11 గొర్రెలు మృతి చెందాయి. స్థానికుల వివరాల మేరకు వెంకటగిరి నుంచి ఓ రోగిని అత్యవర చికిత్స కోసం ఆసుపత్రికి చేర్చేందుకు ఓ ప్రైవేటు అంబులెన్స్ నెల్లూరుకు వెళ్లింది. తిరిగి నెల్లూరు నుంచి వెంకటగిరి వస్తుండగా మార్గమధ్యంలోని తిరుపతిగారిపల్లె వద్ద అదుపుతప్పి గొర్రెల మందను తోలుకుని వెళ్తున్న ఈశ్వరమ్మను, గొర్రెలను ఢీ కొంది. ఈ ప్రమాదంలో 11 గొర్రెలు మృతి చెందగా ఈశ్వరమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సుమారు గొర్రెల పిల్లల నష్టం రూ.1.50 లక్షలు వాటిల్లిందని బాధితురాలు ఆవేదన చెందుతున్నారు. గూడూరు రూరల్ పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్

కోట, మే 20: మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.నాగార్జునరెడ్డికి డాక్టరేట్ ప్రదానం కావడంతో సోమవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు. 'ఆప్టిమైజ్డ్ డీప్ లెర్నింగ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ ఎర్లీ డయాగ్నొస్టిక్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్' అనే అంశంపై ఎన్‌బీకేఆర్ ఈసీఈ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో నాగార్జునరెడ్డి పరిశోధనలను అనంతపురం జెఎన్‌టీయుఏ వర్శిటీకి పంపించారు. ఈయన పంపిన పరిశోధనలు ఉత్తమమైనవిగా ఎంపికై ఆ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. నాగార్జున్‌రెడ్డిని కళాశాల డైరెక్టర్‌తోపాటు ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ హరినాథరెడ్డి, పలు విభాగాధిపతులు అభినందించారు.

తిన్నెలపూడిలో గండవరం 8వ వర్ధంతి

కోట, మే 20 : మండల పరిధిలోని తిన్నెలపూడిలో సోమవారం టీడీపీ రాష్ట్ర రైతు మాజీ కార్యదర్శి, స్వర్గీయ గండవరం రవీంద్రారెడ్డి 8వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. తెలుగుమహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు గండవరం సుష్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొని రవీంద్రారెడ్డికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కోటేశ్వరరెడ్డి, బీసీ సెల్ మండల కార్యదర్శి వరిదిగొల్ల కోటేశ్వరప్రసాద్... రవీంద్రారెడ్డి పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గండవరం రజనమ్మ, నాయకులు కే.నరేంద్రరెడ్డి, బి.సురేష్, రాజేష్, బాబు, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివర్తి నానికి సోమిరెడ్డి పరామర్శ



తిరుచానూరు, మే20: ఈనెల 14న వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడిన చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని సోమవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహాయాదవ్, బంగారుపాళెం మండల అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, తిరుపతి టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళి, పాకాల జడ్పీటీసీ పద్మజారెడ్డి ఆయన స్వగృహానికి చేరుకుని పరామర్శించారు. ఓటమి భయంతోనే వైసీపీ దాడులకు తెగబడుతోందని ఆరోపించారు. పులివర్తి నానికి భారీ మెజార్టీ ఖాయమన్నారు.

22న లక్ష్మీనరసింహుడి జయంతి

బాలాయపల్లి, మే 20: మండలంలోని అలిమిలి పంచాయతీ పరిధిలో కనుమరాయకొండపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 22న స్వామివారి జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. జయంతిని పురస్కరించుకుని ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

హనుమాన్ శోభాయాత్రను జయప్రదం చేయండి



వెంకటగిరి టౌన్, మే 20: హనుమాన్ శోభాయాత్రను ప్రతి హిందువు జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు వడ్లమూడి భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక పెరుమాళ్ స్వామి ఆలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1న హనుమాన్ శోభాయాత్ర జరుగుతుం దన్నారు.మల్లికార్జున్, సుధాకర్, పురుషోత్తం, నర్రారవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి: ఎంఎస్ఎఫ్



వెంకటగిరి టౌన్, మే 20: క్రాస్ రోడ్డులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వసం చేసిన వారిని గుర్తించి వెంటనే శిక్షించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏపీలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున 'చలో వెంకటగిరి' ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నామని తెలిపారు. కోడ్ అనంతరం అధికారులు, రాజకీయ నాయకులు అంబేడ్కర్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గూడూరు ఆర్డీవో, డీఎస్పీ మాట ఇచ్చి ఉన్నారని తెలిపారు. విగ్రహ పునఃనిర్మాణం జరగకపోతే మహా ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. ఎం.సురేష్, గోపాల్, మణి, రవి, శంకర్, రాజకుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా నృసింహుడి బ్రహ్మోత్సవాలు



స్వామిఅమ్మవార్లకు స్నపన తిరుమంజనం - ప్రత్యేక అలంకరణలో స్వామిఅమ్మవార్లు - నృసింహ స్వామి తిరుచ్చి క్షేత్రోత్సవం



విద్యుద్దీపకాంతుల నడుమ నృసింహస్వామి ఆలయం

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం ధ్వజారోహణం అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. తిరుచ్చి ఉత్సవం, సహస్ర దీపాలంకారసేవ, ఊంజల్ సేవలు నేత్రపర్వంగా సాగాయి. బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

- డక్కిలి

విమానం రద్దు కావడంతో ప్రయాణికుల నిరసన



స్టార్‌ఎయిర్‌లైన్స్ టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్ద ప్రయాణికుల నిరసన

రేణిగుంట, మే 20: తిరుపతి విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం ఒక విమాన సర్వీసు రద్దు కావడంతో ప్రయాణికులు నిరసన తెలిపారు. బెంగళూరు నుంచి సాయంత్రం 3.10గంటలకు తిరుపతి చేరుకుని తిరిగి 4.20గంటలకు గుల్బార్గాకు స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం చేరుకోవాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్య కారణంగా సర్వీసు రద్దయింది. అయితే ఒకటిన్నర గంట ముందుగా 32మంది ప్రయాణికులు విమానాశ్రయం చేరుకున్నారు. విమాన సర్వీసు రద్దయిన విషయం తెలుసుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్టార్ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం స్పందించకపోవడంతో టిక్కెట్ బుకింగ్ కౌంటర్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.మంగళవారం వస్తే గుల్బర్గాకు యథాతథంగా పంపిస్తామని చెప్పడంతో కొంతమంది టిక్కెట్ డబ్బులు తీసుకుని వెళ్లిపోగా కొంతమంది ఆ ప్రతిపాదనకు ప్రయాణించేందుకు అంగీకరించారని సమాచారం.

రోడ్డుపై గుంతలను పూడ్చిన స్థానికులు



గూడూరు అర్బన్, మే 20: పట్టణంలోని తిలక్‌నగర్‌లో రోడ్డుపై ఉన్న గుంతలను సోమవారం స్థానికులే శ్రమదానం చేసి పూడ్చారు. తిలక్ నగర్ నుంచి ఇందిరానగర్‌కు వెళ్లే మార్గంలో గత కొద్ది నెలలుగా రోడ్డుపై గుంతలు ఏర్పడంతో వాహనదారులు అవస్థలు పడుతుండేవారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించ లేదు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలూ ఉన్నాయి. దీంతో స్థానికులే సొంతనిధులను వెచ్చించి గుం తలను పూడ్చారు.

శేషవాహనంపై దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహస్వామి



చిల్లకూరు, మే 20: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అం తకు ముందు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ధ్వజారోహణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి శేషవాహనంపై అధిష్టింపజేసి ఆలయ ఆవరణలో స్వామివారిని ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

రైలు ఢీ కొని గుర్తుతెలియని యువకుడి మృతి

నాయుడుపేట టౌన్, మే 20 : నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు ఢీ కొని గుర్తుతెలియని యువకుడు మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు... సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని యువకుడు రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. నీలిరంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. గుర్తుపట్టలేని విధంగా ఛిద్రమవడంతో ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి సూళ్లూరుపేట ఇన్‌చార్జి రైల్వే ఎస్ఐ మాలకొండయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టరు ఢీకొని ఒకరికి గాయాలు

డక్కిలి, మే 20: బైకును ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు గాయపడ్డారు. డీ కోడక్కిలి మండలం కమ్మపల్లి నుంచి గ్రావెల్ లోడ్ చేసుకుని వెళ్తున్న ట్రాక్టరు బైకుపై వస్తున్న శివరాజను ఢీ కొంది. ఈ ఘటనలో శివరాజ కాలు విరగడంతో ఆయన్ను డక్కిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

వివాదాలు సృష్టిస్తే చర్యలు

చిట్టమూరు, మే 20: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఆయా పార్టీల కార్యకర్తలు వివాదాలు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిన్న బలరామయ్య హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నికలు ముగిసినప్పటికి మండలంలోని కొన్ని పార్టీల కార్యకర్తలు వివాదాలకు ఆజ్యం పోస్తున్నారన్నారు. అలాంటి సంఘటనలు జరిగితే పూర్తి బాధ్యత ఆ పార్టీలకు చెందిన నాయకులే కారకులవుతారన్నారు. జూన్ నెల 4న జరిగే కౌంటింగ్‌పై గ్రామాల్లో బెట్టింగులకు పాల్పడడమే కాకుండా రెచ్చగొట్టె విధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ఫలితాలపై ఎక్కడైన బెట్టింగ్‌లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నట్లు గ్రామస్తులకు తెలిస్తే పోలీసులకు దృష్టికి తీసుకరావాలని కోరారు.

కోళ్ల పంపిణీపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టండి

సూళ్లూరుపేట, మే 20: మండల పరిధిలోని మంగానెల్లూరులో పోలింగ్ ముందు రోజు కోళ్ల పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని సర్పంచు సుధాకర్ సోమవారం ఆర్వో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పోలింగ్ ముందు గ్రామంలో ఓటర్లకు కోళ్ల పంపిణీ చేసిన వైసీపీ నాయకులపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరాడు. గ్రామంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన నేపథ్యంలో విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఎన్నికల అధికారులు ఆదేశించారన్నారు. అయితే గ్రామ కార్యదర్శి వి.రాజారెడ్డి ఆధ్వర్యాన విలేజ్ మహిళా పోలీసు, వీఆర్‌ఏ గ్రామంలో తూతూమంత్రంగా విచారణ చేపట్టి ఉల్లంఘన జరగలేదని అధికార పార్టీకి అనుకూలంగా నివేదిక ఇచ్చారన్నారు. కోళ్ల పంపిణీ చేసిన మాట వాస్తమని గ్రామంలో అందరి సమక్షంలో అధికారులు విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశారు. కోళ్ల పంపిణీపై ఆధారాల సహా ఫిర్యాదులో ఇచ్చామన్నారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని వినతి

మండల పరిధిలోని కుదిరి చెరువులో అధికార పార్టీ నాయకులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని దీనిని అడ్డుకొని సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ ఇక్బాల్‌కు కౌన్సిలర్ చిట్టిబాబు వినతి పత్రం అందజేశారు. పరిశీలించి సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.